www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

విలేకరులు కావలెను

17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారిగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక :69 | ఆదివారం 12.04.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

# బుజ్జగింపు రాజకీయాలు చేయం

## బెంగాలీలను మైనారిటీలుగా కానివ్వం..

- మమతా బెనర్జీ ప్రభుత్వంపై ప్రధాని మోడీ ఫైర్..
- బుజ్జగింపు రాజకీయాలకు చెక్ పెడుతామని హామీ..
- బెంగాలీలను మైనారిటీలు కానివ్వమని కామెంట్స్..
- అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో యూసీసీ..
- చొరబాటుదారుల ఓట్లతో ప్రభుత్వం నడుస్తోందని ఆరో
- పణఓట్ బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శఅ
- వినీతి నాయకులను జైలుకు పంపుతామని హెచ్చరిక

**పశ్చిమ బెంగాల్ :** 02

పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోడీ మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో జనాభా మార్పు వేగవంతంగా జరుగుతోందని ఆయన ఆరోపించారు. బెంగాల్‌లో బుజ్జగింపు రాజకీయాలకు చెక్ పెట్టేందుకు తాము "ఉమ్మడి పౌరస్మృతి" తీసుకువస్తున్నామని శనివారం ప్రధాని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బెంగాలీలు మైనారిటీలు కాకుండా బీజేపీ అడ్డుకుంటుందని చెప్పారు.ముస్లింల ఆధిపత్యం ఉన్న ముర్షిదాబాద్ జిల్లాలోని జంగీపూర్‌లో బహిరంగం సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ సాగిస్తున్న "మహా జంగిల్ రాజ్" పాలనకు ముగింపు పలికేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్షా విడుదల చేసిన బీజేపీ ఎన్నికల మానిఫెస్టో ఒక మార్గసూచిక అని మోడీ చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) అమలు చేస్తామని చెప్పారు.



## కాంగ్రెస్ 100 స్థానాల్లో గెలుస్తుంది..

### ప్రభుత్వాలు వస్తాయి, పోతాయ్.. పార్టీ శాశ్వతం

- కేసీఆర్ పాలనపై అవినీతి విమర్శలు
- మహిళలకు ఉచిత బస్సు, సన్న బియ్యం వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు
- దేవాదుల ప్రాజెక్ట్ కోసం ₹600 కోట్లు కేటాయింపు
- జిల్లాకు మెడికల్, నర్సింగ్ కాలేజీలు మంజూరు
- సీతక్క సేవలను ప్రశంసించారు

03









# ఆక్రమణలన్నీ.. మటాష్!

## హైడ్రా భారీ యాక్షన్

- ఆరంతస్తుల బిల్డింగుపై బుల్డోజర్ నాట్యం.. అమీన్పూర్లో పెద్ద ఎత్తున కూల్చివేతలు
- హైకోర్టు న్యాయవాది ముఖీమ్ గెస్ట్హౌస్ నేలమట్టం.. ముఖీమ్ తమ్ముడి అపార్ట్మెంట్ ఖతం
- కృష్ణారెడ్డిపేటలోనూ బుల్డోజర్ యాక్షన్.. మరో రెండు అపార్ట్మెంట్లపై కొరడా
- ఆక్రమణలకు గురైన 860 ఎకరాల ఇనాం భూములు స్వాధీనం
- ఈ భూముల విలువ ఏకంగా ₹15 వేల కోట్లకు పైమాటే


02

**కూల్చివేతలపై స్టే లేదన్న హైడ్రా చీఫ్ రంగనాథ్**

**హైడ్రా చర్యలపై స్థానికుల హర్షం.. పటాకులు కాల్చి సంబురాలు**

హైదరాబాద్, సంగారెడ్డి జిల్లా శివార్లలో ఆక్రమణలకు గురైన కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములను కాపాడేందుకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) భారీ యాక్షన్ చేపట్టింది. శనివారం ఉదయం సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో పెద్దఎత్తున కూల్చివేతలను చేపట్టింది. సుమారు 2,000 మంది రెవెన్యూ, హైడ్రా సిబ్బంది.. వెయ్యి మందికి పైగా పోలీసుల బందోబస్తు మధ్య మెగా ఆపరేషన్ కొనసాగింది. ఐలాపురం తండాలో కానీ, గ్రామంలోని నివాస గృహాల జోలికి వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు హైడ్రా చీఫ్ రంగనాథ్ తెలిపారు. కేవలం అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలు, ఖాళీ స్థలాల స్వాధీనంపైనే దృష్టి సారించినట్లు స్పష్టంచేశారు. 1998 నుంచి 'స్టేటస్ కో' (యథాతథ స్థితి) కొనసాగించాలని కోర్టు ఆర్డర్లు ఉన్న ప్పటికీ ఖాతరు చేయకుండా హైకోర్టు న్యాయవాది ముఖీమ్ నిర్మించిన గెస్ట్ హౌస్ను హైడ్రా నేలమట్టం చేసింది. అలాగే అతని సోదరుడు అజీమ్ అనుమతులు లేకుండా నిర్మించిన ఆరంతస్తుల భవనాన్ని కూడా హైడ్రా బుల్డోజర్లు నేలమట్టం చేశాయి. దీంతో స్థానికులు పటాకులు కాల్చి సంబురాలు చేశారు. హైడ్రా చర్యలను అభినందించారు.

## ఎయిర్ పోర్ట్ లో భారీగా బంగారం పట్టివేత



- ఎయిర్ పోర్ట్ లో భారీగా బంగారం పట్టివేత..
- లేడీ స్మగ్లర్స్ నుండి 30 కేజీల బంగారం సీజ్
- ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో లేడీ స్మగ్లర్స్
- రూ.38 కోట్లు విలువచేసే 30 కేజీల బంగారం సీజ్
- ముంబై ఎయిర్‌పోర్ట్లో దిగారు 24 మంది మహిళ స్మగ్లర్స్ బృందం

05

## కేసీఆర్ బహిరంగసభ..

### జీవన్ చేరికకు సన్నాహాలు!

- జగిత్యాలలో 20న బహిరంగ సభ
- గులాబీ దళపతి కేసీఆర్ రాకకు భారీ ఏర్పాట్లు
- మోతే రోడ్డులో సభా ప్రాంగణం
- లక్షమందిని తరలించేలా ప్లాన్
- పెద్ద ఎత్తున చేరికలుంటాయన్న నేతలు

03





# ముందు నీ ఫ్యూచర్ చూస్కో

## అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

అవినీతి, అక్రమాలు పెరిగాయని ఆరోపణ

అధికారులకు కేటీఆర్ గట్టి హెచ్చరిక ఇచ్చారు

రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని అన్నారు

### ఫార్మా సిటీ - ఫ్యూచర్ సిటీగా మళ్లీ మోసం

03

- కాంగ్రెస్ పార్టీ ప్రజల నమ్మకం కోల్పోతుందని
- వ్యాఖ్యభూముల దందా పెరుగుతోందని ఆరోపణ
- స్థానిక నాయకులు అరాచకాలు చేస్తున్నారని విమర్శ
- ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు

అన్ని వర్గాలను మోసం చేస్తూ, తన కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం పేదవాళ్ల భూములను అరాచకంగా గుంజుకుంటున్న అనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ చరిత్రలో ఒక చరిత్ర హీనుడిగా మిగిలిపోతాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని చీత్కరించే రోజులు తప్పకుండా వస్తాయన్నారు. రేవంత్ రెడ్డి పదవి దిగిపోయిన తర్వాత కనీసం పలకరించే నాథుడు కూడా ఉండడని, కానీ ఇదే రేవంత్ రెడ్డి తన అధికారాన్ని, పదవిని చూసుకొని అహంకారంతో ప్రవర్తిస్తున్నారన్నారు.



## కేంద్రం వెన్నులో వణుకు పుట్టిస్తాం..

**కోటా దక్కేదాకా పోరాటం** 03

**బీసీ మహిళలకు చట్టసభల్లో ఉపకోటా**

**ఢిల్లీ వెళ్తున్నా.. రాజకీయ పార్టీలతో చర్చిస్తా**

**అలుపెరగని పోరాటం చేస్తామన్న జాగృతి కవిత**

## 'నారీ శక్తి'దే రాజ్యం

### 2029 నుంచి మహిళా రిజర్వేషన్ అమలు లక్ష్యం

- పార్లమెంట్‌లో మహిళల సంఖ్య పెరుగుతుంది
- అసెంబ్లీలో కూడా మహిళలకు ఎక్కువ అవకాశాలు
- మహిళలు రాజకీయాల్లో పెద్ద ఎత్తున ముందుకు వస్తారు
- స్త్రీలు గౌరవించబడే చోటే దేవతలు ఉంటారని వ్యాఖ్య
- 33%మహిళా రిజర్వేషన్ బిల్లు ముఖ్యమైనది
- ప్రధాని నరేంద్ర మోడీ మహిళల కోసం బిల్లు తీసుకొస్తున్నారు
- ఇది కోట్లాది మహిళల ఆశయం

05



# లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

**లెబనాన్ :** ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్–అమెరికా మధ్య శాంతి చర్చలు జరుగుతున్నాయి. చర్చలు ఏమవుతాయన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇలాంటి తరుణంలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు దిగింది. తాజా దాడుల్లో ముగ్గురు మృతిచెందారు. దక్షిణ లెబనాన్‌లోని ఒక నివాస భవనంపై శనివారం ఇజ్రాయెల్ దాడి చేసింది. దక్షిణ లెబనాన్‌లోని నబాటియే జిల్లా మెఫాడౌన్ పట్టణంలోని ఒక నివాస భవనాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేసింది. ప్రస్తుతం ముగ్గురు చనిపోయారు. దీనిపై మరింత సమాచారం అందాల్సి ఉంది. అమెరికా–ఇరాన్ చర్చల్లో లెబనాన్ ఒక ప్రధాన డిమాండ్‌గా ఉంది. లెబనాన్‌పై తక్షణమే దాడులు ఆపాలని కోరింది. రెండు వారాల కాల్పుల విరమణలో లెబనాన్‌ను కూడా చేర్చాలని ఇరాన్ వాదిస్తోంది. అయితే ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం రెండు వారాల కాల్పుల విరమణలో లెబనాన్‌ను చేర్చలేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే వచ్చే వారం మంగళవారం వాషింగ్టన్ వేదికగా లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య శాంతి చర్చలకు అమెరికా శ్రీకారం చుట్టింది. అయితే శాంతి చర్చల వరకు దాడులు ఆపాలని ఇజ్రాయెల్‌ను లెబనాన్ కోరింది. అలాగే అమెరికా కూడా సూచించింది. అందుకు ఇజ్రాయెల్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ప్రస్తుతం ఇస్లామాబాద్ వేదికగా అమెరికా చర్చలు జరుపుతున్న తరుణంలోనే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఈ పరిణామాలు ఎలా దారి తీస్తాయో వేచి చూడాలి.

# హార్ముజ్ ఓపెన్ చేసి తీరుతాం

**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ శాంతి చర్చల వేళ యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఒప్పుకున్నా ఒప్పుకోకున్నా ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధిని త్వరలోనే తిరిగి తెరుస్తామని ప్రకటించారు. శాంతి చర్చలలో ఇరాన్ దగ్గర అణ్వాయుధం ఉండకుండా చూడటమే తమ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. శాంతి చర్చలకు ఇరాన్ అంగీకరించకుంటే ఇప్పటి వరకు చూడని భీకర దాడులు చేస్తామని హెచ్చరించారు. శాంతి చర్చల ప్రారంభానికి గంటల ముందు ట్రంప్ చేసిన హాట్ కామెంట్స్‌పై ఇరాన్ ఏ విధంగా రియాక్ట్ అవుతుందో చూడాలీ. పశ్చిమాసియాలో దాదాపు ఆరు వారాలుగా సాగుతోన్న యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో శాంతి చర్చల కోసం అమెరికా, ఇరాన్ బృందాలు పాకిస్తాన్ చేరుకున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని అమెరికా ప్రతినిధి బృందం, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ నాయకత్వంలోని ఇరాన్ టీమ్ శనివారం (ఏప్రిల్ 10) పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ల్యాండ్ అయ్యాయి. ఇరాన్ ప్రతినిధి బృందానికి పాక్ ఉప ప్రధాన మంత్రి, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, జాతీయ అసెంబ్లీ స్పీకర్ అయాజ్ సాదిక్, ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిమ్ మునీర్, అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ స్వాగతం పలికారు. ఇస్లామాబాద్‌లోని సెరీన్ హోటల్‌లో శాంతి చర్చలు జరగనున్నాయి. ఇరుదేశాల ప్రతినిధి బృందాలు మొదట పాక్ పీఎం షెహబాజ్ షరీఫ్‌తో విడివిడిగా సమావేశవుతాయి. ఆ తర్వాత ప్రత్యక్ష చర్చలు జరుపుతాయి. అమెరికాఇరాన్ శాంతి చర్చల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఇస్లామాబాద్‌లో హై అలర్ట్ ప్రకటించారు. నగరం మొత్తం లాక్ డౌన్ విధించి భారీగా బలగాలను మోహరించారు. చర్చలు జరగనున్న సెరెన్ హోటల్ పరిసరాల్లో కర్ఫ్యూ విధించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

# సీపీ సజ్జనార్ కీలక హెచ్చరిక!

## హైదరాబాద్ వాటర్ బిల్లుల పేరుతో భారీ దోపిడీ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వం, పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాలను ఎంచుకొని ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో నగరవాసులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు వాటర్ బిల్లుల పేరుతో కొత్త తరహా మోసాలకు తెరలేపారు. "మీ నీటి బిల్లు బకాయి ఉంది. వెంటనే చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తాం" అంటూ వాటర్ బోర్డు అధికారుల పేరుతో ఫోన్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. సైబర్ నేరగాళ్ల బిల్లు అప్‌డేట్ పేరుతో HMWSSB WATER BILL UPDATE.apk అనే ప్రమాదకరమైన లింక్‌ను పంపి, దానిని ఇన్‌స్టాల్ చేయాలని నమ్మిస్తున్నారు. ఒక్కసారి ఆ ఏపీకే ఫైల్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేస్తే, మీ మొబైల్ నియంత్రణ మొత్తం కేటుగాళ్ల చేతుల్లోకి వెళ్తుందని, వారు మీ కాల్స్‌ను డైవర్ట్ చేయడమే కాకుండా బ్యాంక్ ఓటీపీలను తస్కరించి క్షణాల్లో ఖాతాలను ఖాళీ చేస్తున్నారని ఎక్స్ వేదికగా సీపీ సజ్జనార్ అలర్ట్ జారీ చేశారు.

**జాగ్రత్తగా ఉండండి - ఇలా ఫిర్యాదు చేయండి**

పైన తెలిపినటువంటి బెదిరింపులకు ఆందోళన చెందవద్దని, గుర్తుతెలియని వ్యక్తులు పంపే ఎటువంటి ఫైళ్లను పొరపాటున కూడా ఇన్‌స్టాల్ చేయవద్దని సీపీ సజ్జనార్ సూచించారు. నీటి బిల్లులను కేవలం అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక మొబైల్ యాప్‌ల ద్వారానే చెల్లించాలని, ఎవరైనా అనుమానాస్పదంగా ఫోన్ చేస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ కోరారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని నగరవాసులను సజ్జనార్ అప్రమత్తం చేశారు.

# పాక్-అమెరికా రిలేషన్ ఇదేనా..?



**ఢిల్లీ :** అమెరికా–ఇరాన్ మధ్య పాకిస్తాన్ మధ్యవర్తిత్వం చేస్తోంది. పాకిస్తాన్ మధ్యవర్తిత్వంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సెటైర్లు వేశారు. దాయాది దేశంపై విమర్శలు చేస్తూనే, భారత్‌ను సమర్థించారు. ఇటీవల పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సోషల్ మీడియా పోస్ట్ ఒకటి వైరల్ అయింది. "డ్రాఫ్ట్–ఎక్స్ కోసం పాకిస్తాన్ ప్రధాని మెసేజ్" అనే ఎడిట్–హిస్టరీ హెడల్ ఉన్నట్లు కనిపించింది. అమెరికా పంపిన మెసేజ్‌నే షరీఫ్ పోస్ట్ చేశారు. ఈ వైరల్ పోస్టుపై స్పందించిన థరూర్.. "అమెరికా, పాకిస్తాన్ కు ఎలాంటి సంబంధం ఉందో మీకు తెలుసా.?" అంటూ ప్రశ్నించారు. పాకిస్తాన్ ప్రధాని కోసం అమెరికా ఆ ట్వీట్ రాసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఒక వేళ మీరు, నేను భారత ప్రధాని కోసం ఏదైనా రాస్తే, దానిపై "భారత ప్రధాని కోసం డ్రాఫ్ట్" అని రాస్తామా? అని అడిగారు. షరీఫ్ చేసిన పోస్టు కొన్ని గంటల ముందు ట్రంప్ చేసిన పోస్ట్‌ను పోలి ఉందని అన్నారు. అమెరికా కోసం ఇలాంటి పాత్ర పాకిస్తాన్ మాత్రమే పోషించగలదని ఎద్దేవా చేశారు. ఇరాన్ యుద్ధం జరిగితే మొదటి ప్రభావం దానితో సరిహద్దు పంచుకున్న పాకిస్తాన్‌పై పడుతుందని, శరణార్థుల భారం పాకిస్తాన్ భరించాల్సిందే అని ఆయన అన్నారు. శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూనే, భారత్‌కు ఎవరు మధ్యవర్తిత్వం చేస్తున్నారనేది ముఖ్యం కాదని, ఫలితం ఏంటనేదే ముఖ్యమని థరూర్ చెప్పారు. దౌత్యపరంగా మౌనం కూడా ఒక సహకారమే అని ఆయన అన్నారు. పాకిస్తాన్ మధ్యవర్తిత్వం, భారత్‌కు ఎదురుదెబ్బ అంటూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు థరూర్ చెక్ పెట్టినట్లు అయింది.

# తెలంగాణకు వడగాల్పుల హెచ్చరిక..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఇప్పటికే పెరిగిన ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు వాతావరణ శాఖ పిడుగులాంటి వార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎండల తీవ్రత మరింత పెరగడంతో పాటు ఏప్రిల్ 12 నుంచి ఏప్రిల్ 22 వరకు రాష్ట్రమంతటా తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ కాలంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలో ఎండల ప్రభావం అత్యధికంగా ఉంటుందని, కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 44°C మార్కును కూడా దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**హైదరాబాద్‌లోనూ సెగలు**

వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా ఎండలు దంచికొట్టనున్నాయి. ఏప్రిల్ 12 నుంచి వరుసగా 10 రోజుల పాటు నగరంలో 40°C నుండి 41°C వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఉక్కపోతతో పాటు వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయనున్నాయి. ఈ పది రోజుల వ్యవధిలో వర్షాలు కురిసే అవకాశం చాలా తక్కువగా ఉందని, అక్కడక్కడా చెదురుముదురు జల్లులు తప్ప పెద్దగా ఉపశమనం ఉండదని వాతావరణ నివేదిక స్పష్టం చేస్తోంది. తీవ్రమవుతున్న ఎండల దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని, డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండటానికి తగినంత నీరు, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# బుజ్జగింపు రాజకీయాలు చేయం

**మమతా బెనర్జీ ప్రభుత్వంపై ప్రధాని మోడీ ఫైర్..**
**బుజ్జగింపు రాజకీయాలకు చెక్ పెడుతామని హామీ..**



**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోడీ మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో జనాభా మార్పు వేగవంతంగా జరుగుతోందని ఆయన ఆరోపించారు. బెంగాల్‌లో బుజ్జగింపు రాజకీయాలకు చెక్ పెట్టేందుకు తాము "ఉమ్మడి పౌరస్మృతి" తీసుకువస్తున్నామని శనివారం ప్రధాని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బెంగాలీలు మైనారిటీలు కాకుండా బీజేపీ అడ్డుకుంటుందని చెప్పారు. ముస్లింల ఆధిపత్యం ఉన్న ముర్షిదాబాద్ జిల్లాలోని జంగీపూర్‌లో బహిరంగం సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ సాగిస్తున్న "మహా జంగిల్ రాజ్" పాలనకు ముగింపు పలికేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్షా విడుదల చేసిన బీజేపీ ఎన్నికల మానిఫెస్టో ఒక మార్గసూచిక అని మోడీ చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) అమలు చేస్తామని చెప్పారు. ఆర్జీకర్ హత్యాచార కేసులో నిందితులకు మమతా సర్కార్ ఎలా అండగా నిలిచిందో రాష్ట్ర ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయన అన్నారు. "మా -మాటీ-మనుష్" అనే నినాదంతో టీఎంసీ అధికారంలోకి వచ్చిందని, కానీ ఇప్పుడు చొరబాటుదారుల ఓట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని చూస్తోందని మండిపడ్డారు. ఈ బుజ్జగింపు, ఓట్ బ్యాంక్ రాజకీయాల ఆటను ఇకపై బెంగాల్ సహించదని, రాష్ట్రంలో బెంగాలీలు మైనారిటీలుగా మారడానికి తాము అంగీకరించమని ప్రధాని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతిపరుల్ని జైలుకు పంపుతామని చెప్పారు. భారత్ అంతా శ్రీరామ నవమి జరుపుకుంటే, బెంగాల్‌లో టీఎంసీ అండతో రామనవమి ర్యాలీపై దాడులు జరుగుతున్నాయని, హింస చోటుచేసుకుంటుందని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఓటమి ఖాయమని భావించి, కుట్రలకు పాల్పడుతూ ఏఐ వీడియోలను వ్యాప్తి చేస్తుందని ప్రధాని ఆరోపించారు.

# ఆక్రమణలన్నీ..మటాష్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మరోవైపు, కిష్టారెడ్డిపేటలోని కేపీ రెసిడెన్సీ, క్రిస్టల్ డెవలపర్స్ భవనాల్లో నివసిస్తున్న 45 కుటుంబాలను అధికారులు ఖాళీ చేయించారు. అనంతరం ఆ అపార్ట్మెంట్లను కూల్చివే శారు.. కాగా, ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తమను బలవంతంగా బయటకు పంపుతున్నారని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ.. పేదలు నివసించే ఇళ్లను తాము లక్ష్యంగా చేసుకోలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన వాణిజ్య, పెద్ద కట్టడాలపైనే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లా శివార్లలో ఆక్రమణలకు గురైన కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములను కాపాడేందుకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్. ఏజెన్సీ (హైడ్రా)భారీ యాక్షన్ చేపట్టింది. శనివారం ఉదయం సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో పెద్ద ఎత్తున కూల్చివేతలకు శ్రీకారం చుట్టింది. సుమారు 2,000 మంది రెవెన్యూ, హైడ్రా సిబ్బంది.. వెయ్యి మందికి పైగా పోలీసుల బందోబస్తు మధ్య ఈ మెగా ఆపరేషన్ కొనసాగింది. ఐలాపురం తండాలో కానీ, గ్రామంలోని నివాస గృహాల జోలికి వెళ్లకుండా చర్యలు చేపట్టి నట్లు హైడ్రా చీఫ్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కేవలం అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలు, ఖాళీ స్థలాల స్వాధీనంపైనే దృష్టి సారించినట్లు స్పష్టం చేశారు. 1998 నుంచి 'స్టేటస్ కో' (యథాతథ స్థితి) కొనసాగించాలని కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ, వాటిని ఖాతరు చేయకుండా హైకోర్టు న్యాయవాది ముఖీమ్ నిర్మించిన గెస్ట్ హౌస్ ను హైడ్రా నేలమట్టం చేసింది. అలాగే అతని సోదరుడు అజీమ్ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని కూడా హైడ్రా బుల్డోజర్లు నేలమట్టం చేశాయి.

**అన్నీ పరిశీలించిన తర్వాతే కూల్చివేతలు..**

తమ కష్టార్జితంతో కొనుక్కున్న ఇళ్లను కూల్చవద్దని స్థానికులు, కొనుగో లుదారులు ఆందోళనకు దిగారు. అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఈ కూల్చివేతలపై హైడ్రా చీఫ్ రంగనాథ్ మాట్లాడుతూ.. అజిమ్ కట్టిన అపార్ట్మెంట్ కూల్చివేతలపై ఎటువంటి స్టే లేదని తేల్చి చెప్పారు. ఈ భవనం చాలా కాలంగా ఖాళీగా ఉంటోందన్నారు. కబ్జాదారుడు అజీమ్ కొంతమందిని ఈ అపార్ట్మెంట్లో ఉంచి వారంతా అద్దెకు ఉంటున్నారని నమ్మించి ప్రయత్నం చేసినట్లు చెప్పారు. అన్ని డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరమే కూల్చివేతలు చేపట్టినట్లు తెలిపారు.

**స్థానికులు సంబరాలు..**

న్యాయవాది ముఖీమ్ ఆక్రమణలపై హైడ్రా చర్యలు తీసుకోవడంతో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. తమ లే ఔట్లను కబ్జా చేసి అమ్మేసిన తీరును ఒక్కొక్కరు వెల్లడిస్తున్నారు. న్యాయవాది ముసుగులో భూ ఆక్రమణలు చేసినట్టు చెబుతున్నారు. వాటిని హైడ్రా తొలగించినందుకు రాజగోపాలనగర్ కాలనీ లే అవుట్ ప్లాట్ల యజమానులతో పాటు విద్యుత్ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ లేఔట్ ప్రతినిధులు హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు. ఐలాపురం భూమిలో తమ లే ఔట్లను కాపాడుకోవాలని కోర్టుకు వెళ్లామని, కోర్టు తీర్పుకోసం ఎదురుచూస్తున్న సమయంలో ముఖీమ్ ఇక్కడ భూములను ఆక్రమించి అమ్మేవేశాడని తెలిపారు. దీంతో హైడ్రాకు ఫిర్యాదు. చేయడంతో చర్యలు తీసుకున్నారని వివరించారు.

**₹15 వేల కోట్ల భూమి..**

ఐలాపూర్ గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే అనేక నివాసాలు వెలిశాయి. మిగిలి ఉన్న 860 ఎకరాల ఖాళీ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టింది. ఈ భూమి విలువ సుమారు ₹15 వేల కోట్ల పైమాటే ఉందని అంచనా. నిజాం కాలం నాటి సుమారు 1.260 ఎకరాల ఇనాం భూములను కబ్జాదారుల నుంచి కాపాడటమే ఆపరేషన్ లక్ష్యమని, స్వాధీనం చేసుకున్న భూమికి త్వరలోనే ఫెన్సింగ్ వేస్తామని హైడ్రా అధికారులు వెల్లడించారు.

# తెలంగాణ ఎక్సైజ్ డిపార్ట్మెంట్‌లో కలకలం..




**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్, నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ మధ్య వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి దూషిస్తున్నారని డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆరోపించారు. తన 30 ఏళ్ల సేవలను వదులుకుంటూ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం ద్వారా ప్రకటించారు. ఎక్సైజ్ కమిషనర్ మాటలతో మనస్తాపం చెంది, ఆస్పత్రి పాలైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ మాటలు, వేధింపులు తట్టుకోలేకే ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. బదిలీల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. లోయర్ క్యాడర్ ఉద్యోగుల ముందు కమిషనర్ ఇష్టానుసారం మాట్లాడడం బాధ కలిగించిందని భావోద్వేగానికి గురయ్యారు. ఆత్మాభిమానాన్ని చంపుకొని ఉద్యోగం చెయ్యలేనంటూ ప్రభుత్వానికి డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి లేఖ రాశారు.

**తప్పు చేయకుండా మాటలు పడలేం: సోమిరెడ్డి**

హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సోమిరెడ్డి మాట్లాడుతూ.. 'గురువారం అర్ధరాత్రి నాంపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్ల బదిలీల సమావేశం జరిగింది. సూపరింటెండెంట్ల ట్రాన్స్‌ఫర్ల విషయంలో ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి అన్యాయంగా మాట్లాడారు. ఎక్సైజ్ కమిషనర్ తీరు సరిగా లేదు. నన్ను ఒక వెధవ అని సంబోధించారు. నన్నే కాదు చాలా మంది సిబ్బందిని ఇలానే నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేవారు. రెండు సంవత్సరాల నుంచి కమిషనర్ తీరు ఇలాగే ఉంది. ఒక తెలంగాణ వ్యక్తిగా ఏ తప్పు చేయకున్నా అధికారి తిడితే మాటలు పడలేం. అందుకే ఇక ఈ ఉద్యోగం చేయకూడదని డిసైడ్ అయ్యాను. 30 ఏళ్ల సర్వీస్ వదులుకుంటున్నందుకు బాధగా ఉన్నా తప్పడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎన్ని ఆఫర్లు వచ్చినా లొంగలేదు




**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తనకు ఆఫర్లు వచ్చినా లొంగకుండా కమిట్మెంట్ తో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశానని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా సంగనభట్ల దినేష్ కుమార్ ప్రమాణ స్వీకారానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అవమానాలను తట్టుకుంటూ నమ్మిన కాంగ్రెస్ సిద్ధాంతాల కోసం జెండా పట్టుకొని పని చేశాను కాబట్టే తనకు ఈరోజు క్యాబినెట్ లో పని చేసే అవకాశం వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్న ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో రేవంత్ పోవాలి.. మార్పు రావాలి అని జీవన్ రెడ్డి నినాదం ఎత్తుకున్నారని పేదలకు సన్న బియ్యం ఇచ్చినందుకా, రేషన్ కార్డులు మంజూరు చేసినందుకా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకా లేక ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినందుకా ఎందుకు రేవంత్ పాలన పోవాలో జీవన్ రెడ్డి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చి తీరుతామని స్పష్టం చేశారు. నూతనంగా గ్రంథా లయ చైర్మన్ గా నియామకమైన సంఘనభట్ల దినేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తగా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన సంగనభట్ల దినేష్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు యువకులు దుర్మరణం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. అతివేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో, ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు పాతబస్తీకి చెందిన అబ్దుల్ సోహెద్ (20) షేక్ సాహిల్ (17)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తున్నట్లు సమాచారం. పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కీసరలో డెకాయిటీ గ్యాంగ్ అరెస్ట్



**కీసర,ఫ్లాష్ ఇండియా :** మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్ లో డీసీపీ శ్రీధర్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు రోజుల క్రితం బాధితులు పై దాడి చేసి 15 గ్రాముల గోల్డ్, షిఫ్ట్ కార్, ఆరు సెల్ ఫోన్ లో, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నాలుగు రోజుల్లో కేసులు ఛేదించారు. ఏడుగురు నిందితుల్లో ఒకరు తప్పించుకోగా ఆరుగురుని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు. గతంలో అబ్దుల్లాపూర్మెట్ ఘట్కేసర్, కీసర పలు దొంగతనాలు చేసినట్లు తెలిపారు. నిందితులు 1. కుసుమ కార్తీక్, 2 రామ్ రాజా , 3. బబ్లు సింగ్, 4. కందుల సాయి తేజ,5. గండ్ల శ్రావణ్, 6. మాచర్ల పవన్ కళ్యాణ్, 7 చెన్నకేశవుల పవన్ కళ్యాణ్ పరారీ పరారీలో ఉన్నాడు. అందరూ వరంగల్ ప్రాంతానికి చెందినవారు. Grinder app gay ఆప్ ద్వారా పరిచయం చేసుకొని గేలను టార్గెట్ చేస్తూ వారిని దోచుకుంటున్నారు. వారిని వీడియోలు ఫోటోలు తీస్తూ బ్లాక్ మెయిల్ చేస్తూ వారి వద్ద ఉన్న సొత్తును దోచుకుంటూ బ్లాక్ మెయిల్ కు పాల్పడుతున్నారు. సోషల్ మీడియా ప్రైవేట్ యాప్ మోజులో పడద్దని యువత అప్రమత్తంగా ఉండాలని డిసిపి సిహెచ్ శ్రీధర్ సూచించారు. ఈ సందర్భంగా కేసును త్వరగా చేధించిన కీసర పోలీసులను అభినందించారు. ఈ ప్రెస్ మీట్ లో ఎసిపి చక్రవర్తి,కీసర సి ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్..

**పశ్చిమ బెంగాల్ :** అసెంబ్లీ ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం మరోసారి తెరపైకి వచ్చింది. ఇవాళ ఉదయం మాజీ విద్యాశాఖ మంత్రి, సస్పెండ్ అయిన టీఎంసీ నేత పార్థా ఛటర్జీ నివాసంతో పాటు పలువురి నివాసాలపై ఈడీ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. అయితే, టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలని ఈడీ అధికారులు పార్థా ఛటర్జీకి మూడుసార్లు నోటీసులు జారీ చేశారు. అయితే, అనారోగ్య కారణాలు చూపుతూ ఆయన విచారణకు హాజరు కాలేదు. దీంతో ఇవాళ ఉదయం కోల్‌కతాలోని ఆయన 'నకతలా' నివాసానికి ఈడీ బృందం చేరుకుంది. భారీగా కేంద్ర బలగాల మోహరింపు మధ్య ఈ సోదాలు కొనసాగుతున్నాయి. పార్థా ఛటర్జీ నివాసంతో పాటు, ఈ కేసులో మధ్యవర్తిగా ఆరోపణలు ఎదుర్కొంటూ ప్రస్తుతం జైల్లో ఉన్న ప్రసన్న కుమార్ రాయ్ నివాసంలో కూడా ఈడీ సోదాలు చేపట్టింది. ఇక పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు (2026) సమీపిస్తున్న తరుణంలో ఈ దాడులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 2022లో ఈ కుంభకోణంలో అరెస్ట్ అయిన పార్థా ఛటర్జీ, ఇటీవల సుప్రీంకోర్టు నుంచి షరతులతో కూడిన బెయిల్ పొంది జైలు నుంచి విడుదలయ్యారు. అయితే, ప్రైమరీ టీచర్ల నియామకం, గ్రూప్-సీ, డీ స్టాఫ్ రిక్రూట్‌మెంట్లలో అక్రమాలకు సంబంధించి విచారణ ఇంకా కొనసాగుతోంది. 2022లో ఈడీ సోదాల్లో పార్థా ఛటర్జీ సన్నిహితురాలు అర్పితా ముఖర్జీ నివాసంలో రూ.50 కోట్లకు పైగా నగదు, భారీగా బంగారం లభించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కుంభకోణం కారణంగా దాదాపు 26 వేల మంది ఉద్యోగాలను సుప్రీంకోర్టు రద్దు చేయడం అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

# కేసీఆర్ బహిరంగసభ..

**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాలు మళ్లీ హాట్ టాపిక్ గా మారాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నాయకులు మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ వీడడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జీవన్ రెడ్డి ఇప్పటికే బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ ను కలిసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జగిత్యాలలో ఈ నెల 20 న సాయంత్రం 05 గంటలకు కెసిఆర్ బహిరంగసభ నిర్వహించనున్నారు. కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకొనున్నారు మాజీ మంత్రి జీవన్ రెడ్డి. జిల్లా కేంద్రంలోని మోతె రోడ్ లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సమాచారం. బహిరంగ సభ స్థలాలను మాజీమంత్రి జీవన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా బిఆర్ఎస్ నేతలు పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ఎస్.కె.ఎన్.ఆర్ డిగ్రీ కాలేజ్, మోతే రోడ్డు, కాలేజీ గ్రౌండ్ స్థలాలను పరిశీలించారు. జగిత్యాల లో కేసీఆర్ సభ స్థలాలను పరిశీలించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ రమణ, లోక్ బాపు రెడ్డి లు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ లు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. ఈ నెల 20 న జగిత్యాల మోతె రోడ్ లో కేసీఆర్ బహిరంగా సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసీఆర్ కోసం రావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సుమరు ఒక లక్ష మంది తో సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నా శేష జీవితంలో కేసీఆర్ తో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా.. మార్పు రావాలంటే కేసీఆర్ రావాలి రేవంత్ రెడ్డి పోవాలి.. రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని తెలిపారు.

# కేంద్రం వెన్నులో వణుకు పుట్టిస్తాం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధనే లక్ష్యంగా, బీసీ మహిళలకు చట్టసభల్లో ఉప కోటా దక్కే వరకు తెలంగాణ జాగృతి విశ్రమించబోదని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు వచ్చినప్పటికీ, అందులో బీసీ మహిళలకు ఉపకోటా లేకపోవడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ ఉపకోటా లేకపోవడమంటే పాలకులకు భయం లేనట్లేనని, కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా జాగృతి ఉద్యమిస్తుందని వార్నింగ్ ఇచ్చారు. పూలే మళ్లీ పుట్టారా అన్నట్లుగా ఈ పోరాటం ఉంటుందని కవిత అన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మహిళా బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ జరగనున్న నేపథ్యంలో తాను ఢిల్లీ కి వెళ్లి అన్ని రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడతానని కవిత వెల్లడించారు. ఎంపీల బలం ఉందని బిల్లును అలాగే పాస్ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం పూలే విగ్రహ ఏర్పాటులో జాప్యం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని కోరితే ట్యాంక్ బండ్ వద్ద పెడతామని ప్రభుత్వం చెప్పిందని, కానీ ఇప్పటి వరకు ఆ పనులు పూర్తి కాలేదని విమర్శించారు. అంబేద్కర్ జయంతి నాటికైనా విగ్రహాన్ని పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

**ఆర్టిజన్లకు పూర్తి మద్దతు..**

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల క్రమబద్ధీకరణ కోసం జాగృతి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు కవిత తెలిపారు. ఆర్టిజన్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం చూస్తోందని, దీనికి నిరసనగా కొత్తగూడెంలో జరుగుతున్న ఆందోళనలో జాగృతి నాయకులు పాల్గొంటారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆటిజన్ల జీతాలు రూ.40 వేలకు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని ఆమె గుర్తు చేశారు. సమాజంలో మార్పు రావాలంటే అది మన నుంచే మొదలు కావాలని అన్నారు. పూలే ఎన్ని అవమానాలు ఎదురైనా వెన్ను చూపకుండా పోరాడారని గుర్తు చేశారు. సామాజిక న్యాయం కోసం అహర్నిశలు పనిచేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని కవిత పిలుపునిచ్చారు.

# రైతుల పట్ల చిన్న చూపు ఎందుకు..?

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిన్న చూపు ఎందుకు అని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సూటిగా ప్రశ్నించారు. సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను మాజీ మంత్రి హరీష్ రావు సందర్శించి రైతులతో మాట్లాడారు. పొద్దు తిరుగుడు, మొక్క జొన్న ధాన్యం నాలుగు రోజులుగా కొనుగోలు చేయడం లేదని రైతులు చెప్పడంతో వెంటనే అధికారులను ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్ ను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదని ఎద్దెవా చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం అని మండిపడ్డారు. నారాయణ కేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో జొన్న కొనుగోలు సెంటర్ లు ప్రారంభం చేయక పోవడం దారుణమన్నారు. వెంటనే కొనుగోలు సెంటర్ లు ప్రారంభం చేసి రైతులకు మద్దతు ధర అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులు తక్కువ ధరకు పండించిన ధాన్యం అమ్ముకుని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

**బీసీలను సీఎం రేవంత్ రెడ్డి దగా చేసిండు**

బీసీ డిక్లరేషన్ పేరిట సీఎం రేవంత్ రెడ్డి బీసీలను మోసం చేశారని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. కేసీఆర్ అన్ని కుల వృత్తులను ప్రోత్సహించారని గుర్తు చేశారు. బీసీ లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని మండిపడ్డారు. బీసీ విద్యార్థుల ఫీజు రియాంబర్స్ మెంట్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ ఛేశారు. పూలే జయంతీ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 100 స్థానాల్లో గెలుస్తుంది..

## బీఆర్ఎస్‌తో జీవన్ రెడ్డి చేతులు కలపడం బాధాకరం



**ములుగు,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వాలు వస్తాయి పోతాయ్.. పార్టీ శాశ్వతమని టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ములుగులో జరిగిన పార్టీ సమావేశంలో సీతక్కతో కలిసి శనివారం పాల్గొన్నారు. బీఆర్ఎస్ హయాంలో 8 లక్షల కోట్ల అప్పు చేసి కేసీఆర్ ఫామ్ హౌస్ కి పరిమితమయ్యారని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలుకొని సన్న బియ్యం వరకు అనేక చారిత్రాత్మక పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించిందన్నారు. జిల్లాకు మెడికల్, నర్సింగ్ కళాశాల మంజూరు చేస్తుమన్నారు. సీతక్క అప్పుడు తుపాకీతో ఇప్పుడు మంత్రిగా ప్రజలకు సేవ చేస్తోందని అన్నారు. గ్లోబల్ సమ్మిట్ తో 5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. బావబామ్మర్దులు ఒక దిక్కు, చెల్లి మరో దిక్కు రాష్ట్రాన్ని, దేశాన్ని దోచుకున్నారన్నారు. కేసీఆర్ అవినీతి పాలనకు నిదర్శనం కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడం అని అన్నారు. మామ అల్లుడు అవినీతి వల్లే కాళేశ్వరానికి ఈ గతి పట్టిందన్నారు. డీలిమిటేషన్ తో 100 సైట్లు గెలవడం పక్కా అని అన్నారు. కుర్చీ కోసం బావ బామ్మర్దులు కొట్లాట పడుతున్నారన్నారు. మా కుటుంబం అవినీతి చేసిందని ఇంటి ఆడబిడ్డ చెబుతోందన్నారు. బీజేపీకి తెలంగాణలో చోటు లేదన్నారు. రాష్ట్రానికి ఈ 12 ఏళ్లలో బీజేపీ వల్ల ఒరిగింది ఏమి లేదని అన్నారు. లాభాల్లో ఉన్న సంస్థలను అంబానీ అదానీ లకు కట్టబెట్టారన్నారు. ఉదయం లేస్తే దేవుడి పేరు చెప్పి బీజేపీ నేతలు రాజకీయాలు చేస్తున్నారన్నారు. సమ్మక్క సారక్క జాతర కోసం 200 పైగా కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. దొడ్డు బియ్యంతో బీఆర్ఎస్ నేతలు జేబులు నింపుకున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళ సిద్ధాంతో పాలన కొనసాగుతుందన్నారు. కుల సర్వే చేసి దేశానికి రోల్ మోడల్ గా నిలిచామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 శాతం బీసీలకు టికెట్లను ఇచ్చామన్నారు. అన్ని పథకాలు అమలు చేస్తున్నామని ప్రకటించారు.

# జీసీసీల గమ్యస్థానంగా హైదరాబాద్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రపంచంలోని దిగ్గజ ఫైనాన్స్ సంస్థలన్నీ తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల ఏర్పాటుకు హైదరాబాద్ నగరాన్ని గమ్యస్థానంగా ఎంచుకున్నాయని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. నైపుణ్యాలతో కూడిన టేలెంట్ పూల్, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ సమస్య లేని రోడ్లు, అందుబాటులో ఉండే అద్దెలు ప్రముఖ కంపెనీలని ఆకర్షిస్తున్నాయని ఆయన తెలిపారు. న్యూయార్క్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే పికో టెక్నాలజి సంస్థప్రతినిధులు శనివారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో శ్రీధర్ బాబుతో భేటీ అయ్యారు. రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఫైనాన్సియల్ మార్కెట్‌కు సంబంధించిన సేవలు అందించే పికో టెక్నోలజీ సంస్థ పికో టెక్నాలజీ ఇండియా అనుబంధ కంపెనీ ద్వారా ఇక్కడ జీసీసీ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ సంసర్భంగా ఇక్కడి అవకాశాలు, మౌలిక వసతుల గురించి శ్రీధర్ బాబు వారికి వివరించారు.

**అక్కడి సంస్థలు హైదరాబాద్‌కు:**

రానున్న 5-10 సంవత్సరాలు, తర్వాత 20 సంవత్సరాల అవసరాలకు తగిన విధంగా మౌలిక సదుపాయాలు మెరుగు పర్చేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. బెంగళూరు, ముంబాయి నగరాలతో పోలిస్తే ఇక్కడ ఆఫీసు స్థలాల ఆక్యుపెన్సీ 73 శాతం ఉందని చెప్పారు. ముంబయిలో అది 52 శాతం మాత్రమేనని తెలిపారు. బెంగళూరు, ముంబయి మెట్రో నగరాల్లో ట్రాఫిక్, వాయు కాలుష్యం ప్రధాన సమస్యలుగా మారినందున ఐటి సంస్థలు, జీసీసీలు హైదరాబాద్ కు తరలి వస్తున్నాయని తెలిపారు.

**రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు: కోమటిరెడ్డి**

ఇప్పుడున్న నెహ్రూ రింగ్ రోడ్డుకు 30 కిలో వెలుపల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. దానికి అనుబంధంగా రేడియల్ రోడ్లు ఏర్పాటవుతున్నాయిని వివరించారు. రింగ్ రోడ్ల పక్కన రైలు మార్గాన్ని కూడా ఏర్పాటు చేసి రవాణా సదుపాయాలను ప్రపంచంలోని పెద్ద నగరాలను తలదన్నేలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హయత్ నగర్- ఎల్బీనగర్ ల మధ్య డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మిస్తున్నట్టు వివరించారు. కింది రోడ్డు స్థానిక ట్రాఫిక్ అవసరాలకు వినియోగిస్తామని పైన ఉండే రెండు అండు అంతస్థుల రోడ్లు నగరం నుంచి వెలుపలకు, లోపలకి వచ్చే వాహనాల కోసం ప్రత్యేకిస్తామని చెప్పారు. నాగపూర్ తర్వాత డబుల్ డెక్కర్ రోడ్లు నిర్మిస్తున్న నగరం ఇదేనని అన్నారు. రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పికో టెక్నాలజీ వ్యవస్థాపక సిఇఓ జారొడ్ యుస్టర్ , పికో ఇండియా సిఇఓ హరి కోదండరామన్, డైరెక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు,

# ముందు నీ ఫ్యూచర్ చూస్కో

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అన్ని వర్గాలను మోసం చేస్తూ, తన కుటుంబ సభ్యులు అనుచరుల కోసం పేదవాళ్ల భూములను అరాచకంగా గుంజుకుంటున్న రేవంత్ రెడ్డి, తెలంగాణ చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని చీత్కరించే రోజులు తప్పకుండా వస్తాయన్నారు. రేవంత్ రెడ్డి పదవి దిగిపోయిన తర్వాత కనీసం పలకరించే నాథుడు కూడా ఉండడని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఆ విషయం మర్చిపోయి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. ఈరోజు మున్సిపల్ ఎన్నికల అనంతరం దాదాపు రెండు నెలల పాటు అన్ని రకాల అన్యాయాలు, అక్రమాలు చేసిన తర్వాత ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ సమితి గులాబీ జెండా ఎగిరిందన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వాళ్లు గెలిచిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ అక్రమంగా చైర్మన్ పదవులను తీసుకునేందుకు అనేక దురాగతాలకు పాల్పడిందని, అయితే చివరికి న్యాయం గెలిచిందని కేటీఆర్ అన్నారు.

**ఫార్మాసిటీ పేరుతో సీఎం రేవంత్ భూ దందా..**

ఈరోజు ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్, తాజాగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లను, సర్పంచ్‌లను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎమ్మెల్యే అరాచకాలను ఎదుర్కొని బలంగా నిలబడిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి కుమారుడు, పార్టీ యువ నాయకుడు ప్రశాంత్ రెడ్డిని ప్రత్యేకంగా కేటీఆర్ అభినందించారు. మంచి నాయకత్వం, మొండితనం ఉన్న నాయకత్వం ఉంటే ఖచ్చితంగా ప్రజలు ఆదరిస్తారని ప్రశాంత్ ఈ ఎన్నికల్లో సాధించిన విజయం నిరూపించిందన్నారు. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫార్మా సిటీ పేరుతో భూముల దందా చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం సేకరించిన 14,000 ఎకరాల ఫార్మా సిటీ భూములను తిరిగి రైతన్నలకు ఇస్తామని చెప్పి వారితో ఓట్లు వేయించుకొని, ఇప్పుడు ఫోర్త్ సిటీ పేరుతో మోసం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ఒకవైపు కోర్టులో ఫార్మా సిటీ ఉందని చెబుతూ, బయటకు వచ్చి అవే భూముల్లో ఫోర్త్ సిటీ కడతామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతుందన్నారు. ఆనాడు ఫార్మా సిటీ భూముల్లో అప్పటి సీఎల్పీ నాయకుడిగా ఉన్న భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా మిగిలిన మేధావులు పాదయాత్ర చేసి, "మాకు ఓటు వేస్తే మీ భూములు మీకు తిరిగి అప్పజెపుతాం" అని హామీ ఇచ్చారని, రెండున్నర సంవత్సరాల తర్వాత మరో 16,000 ఎకరాల అదనపు భూమిని రైతుల నుంచి గుంజుకొని ఫోర్త్ సిటీని, భారత్ ఫ్యూచర్ సిటీని కడతానని నాటకాలు ఆడుతున్నారన్నారు. కేవలం తన అనుచరులకు, తన కుటుంబ సభ్యులు సోదరులకి భూములు కట్టబెట్టడం కోసమే ఈ ఫ్యూచర్ సిటీ డ్రామాను రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ తెరలేపిందన్నారు.

**ఆ తెలివి రేవంత్ రెడ్డికి లేదు..**

ఉన్న సిటీనే పట్టించుకునే తెలివి రేవంత్ రెడ్డికి లేదు. ఉన్న సిటీలో దోమలు కుట్టి జనం చనిపోతుంటే పట్టించుకునే పరిస్థితి లేదు, అలాంటిది ఫ్యూచర్ సిటీ కడతానని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. ఫ్యూచరే లేని నాయకుడు మళ్లీ ఫ్యూచర్ సిటీ కడతా అంటే ప్రజలు నవ్వుతున్నారన్నారు. గత ప్రభుత్వం కోహెడలో 178 ఎకరాల భారీ విస్తీర్ణంలో అతిపెద్ద పండ్ల మార్కెట్ కడతామని అంటే, వాటిని మళ్ళీ ఇప్పుడు రాచకొండ గుట్టలకో, రామోజీ ఫిలిం సిటీ అవతలకో పోవాలని చెప్పి ప్రభుత్వం చెబుతుందన్నారు. ఈ ఉన్న 178 ఎకరాలను అమ్ముకునేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ఒకప్పుడు నిషేధిత భూముల జాబితాను తగ్గించి భూమి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత 16 లక్షలు ఉన్న నిషేధిత భూముల సంఖ్యను కోటి ఎకరాలకు పెంచి, అందరినీ బ్లాక్ మెయిల్ చేస్తూ భూముల దందా చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఈ నిషేధిత జాబితాను అడ్డుపెట్టుకొని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేసి ప్రజలను ఇబ్బందులు పెడుతూ భూముల దందా సెటిల్మెంట్లకు పాల్పడుతున్నారన్నారు.

**వారి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది..**

ఇక ఇబ్రహీంపట్నం స్థానిక ఎమ్మెల్యే అవినీతి గురించి, అరాచకాల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. హోటళ్ల నుంచి, బార్ల నుంచి, క్రషర్ల నుంచి ప్రతి ఒక్కరి నుంచి అడ్డగోలుగా నెలకి ఇంత చొప్పున రేటు నిర్ణయించి వసూలు చేస్తున్న అరాచకాలను కేటీఆర్ ప్రస్తావించారు. ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా రేవంత్ రెడ్డి లాంటి అరాచక శక్తిని ఎదుర్కొని, అక్రమ కేసులను ఎదుర్కొని పార్టీ వెంటనే నిలబడి మున్సిపల్ పీఠాన్ని దక్కించుకున్న ప్రతి ఒక్క నాయకుడికి, మున్సిపల్ కౌన్సిలర్‌కి పేరు పేరునా ధన్యవాదాలు చెబుతున్నానని కేటీఆర్ తెలిపారు. రెండున్నర సంవత్సరాల పాటు మన పార్టీకి ఉన్న కష్టకాలం పోయిందని, త్వరలోనే రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయన్నారు. అధికారులు కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు లొంగి అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని, రానున్న గవర్నమెంట్లో వారందరినీ గుర్తుంచుకొని మరీ తగిన విధంగా శిక్షిస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజల కోసం పని చేయాలని కేటీఆర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్ తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** గజ్వేల్ అభివృద్ధికి ఈ రింగ్ రోడ్డు కీలకమైనదని..నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. ఈరోజు(శనివారం) గజ్వేల్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును రఘునందన్ రావు పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నర్మెట్టకు వచ్చినప్పుడు అసంపూర్తిగా ఉన్నా గజ్వేల్ రింగ్ రోడ్డు వ్యవహారం గురించి వివరించానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పుడు పరిష్కరిస్తామని సభ వేదికగా చెప్పారని ప్రస్తావించారు. రింగ్ రోడ్డు పూర్తి కావడానికి 151 మీటర్ల భూ సేకరణ పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. ఒక రైతుని పిలిచి ఒప్పించడంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అంతా కూడా నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. రింగ్ రోడ్డు వ్యవహారంలో సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి తానే స్వయంగా వచ్చి పరిశీలించానని తెలిపారు. జిల్లా ఎంపీగా భూమి ఇచ్చే రైతుతో మాట్లాడి ఈ పనులపై చొరవ తీసుకుంటానని అన్నారు. ఒక వేళ రైతు భూమి ఇచ్చే వ్యవహారంలో అంగీకరించని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

# నిర్లక్ష్యంపై కఠిన చర్యలు!

**కోదాడ,ఫ్లాష్ ఇండియా :** సూర్యాపేట జిల్లా కోదాడ వద్ద జరిగిన బస్సు--లారీ ఢీకొన్న ప్రమాద ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే స్పందించి వివరాలు సేకరించారు. శనివారం జరిగిన ఈ ప్రమాదంలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సును వెనుకనుంచి లారీ ఢీకొనడంతో కలకలం రేగింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 46 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణాపాయం కలగకపోవడం ఊరటనిచ్చే విషయం. అయితే 16 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు కావడంతో వారిని తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్థానిక అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర నివేదిక కోరారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో విధుల్లో



నిర్లక్ష్యం వహించిన వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని మంత్రి గట్టిగా హెచ్చరించారు. ప్రమాదానికి బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన నేపథ్యంలో రహదారి భద్రతా చర్యల పై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భారీ వాహనాల నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నియంత్రణ లో లోపాలు ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఓయూ స్టూడెంట్స్‌కి గుడ్ న్యూస్..



**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల రవాణా అవసరాల కోసం మూడు బస్సులను విరాళంగా అందజేసింది. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు బస్సుల తాళాలను వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగారంకు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం మాట్లాడుతూ ఎస్‌బీఐ సంస్థ విద్యార్థుల పట్ల చూపుతున్న అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ బస్సులు విద్యార్థుల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు వారి విద్యా ప్రయాణానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. ఎస్‌బీఐ ప్రధాన అధికారి ఎస్.రాధాకృష్ణన్ మాట్లాడుతూ దేశంలో అగ్రగామి బ్యాంక్‌గా ఉన్న ఎస్‌బీఐ, శతాబ్దాల విద్యా వారసత్వం కలిగిన ఓయూ కలిసి పనిచేయడం గర్వకారణమన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడుతున్నామన్నారు. ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని పేర్కొంటూ, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అనంతరం కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, ఎస్‌బీఐ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పూలే వికసిత భారత్‌కు దారిదీపం

ఏప్రిల్ 11 నేడు. మనందరికీ చాలా ప్రత్యేకమైన రోజు. భారతదేశపు అగ్రశ్రేణి సంఘ సంస్కర్తల్లో ఒకరు, తరతరాలకూ మార్గదర్శిగా నిలిచిన క్రాంతిపథగామి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నేడు. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభం నేపథ్యంలో, ఈ ఏడాది మరింత విశిష్టతను సంతరించుకున్నది.మహాత్మా పూలే గొప్ప సంఘసంస్కర్త. అంతేకాదు.. నైతిక స్థైర్యం, నిరంతర సత్యాన్వేషణ, సామాజిక శ్రేయస్సు పట్ల అచంచలమైన అంకితభావం కలబోసిన ఉదాత్త జీవితం ఆయనది. ఎన్నో సంస్థలను నెలకొల్పి, ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించి చిరస్మరణీయులయ్యారు పూలే. ఆయన రేకెత్తించిన సరికొత్త ఆశలు, దేశ ప్రజల్లో నింపిన ఆత్మవిశ్వాసం, మన నాగరికతా పరిణామక్రమంలో ఆయన చేసిన అసమానమైన సేవలూ... నేటికీ లక్షలాది మందికి స్ఫూర్తిని అందిస్తున్నాయి.పుణ్యభూమి మహారాష్ట్రలో 1827లో మహాత్మా పూలే జన్మించారు. అతి సామాన్య నేపథ్యం నుంచి ఎదిగారాయన. కానీ తొలినాటి కష్టాలేవీ ఆయన అభ్యాసానికీ, ధైర్యానికీ, సామాజిక నిబద్ధతకూ అడ్డుగోడలు కాలేకపోయాయి. సవాళ్లు ఏవైనా సరే-- నిశ్చేష్టులుగా ఉండిపోకుండా.. కష్టపడి జ్ఞానాన్ని ఆర్జించి, ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్న దృఢ సంకల్పమే ఆయనలో ఎన్నడూ తొణికిసలాడేది. విద్యార్థి దశ నుంచే జ్యోతిరావు పూలేలో అపారమైన జిజ్ఞాస ఉండేది. నిరంతర అధ్యయనశీలి. తన వయసు పిల్లల స్థాయికి మించిన పుస్తకాలను చదివేవాడు. "మనం ఎంత ప్రశ్నిస్తే అంత జ్ఞానాన్ని పొందుతాం" అని తర్వాతి కాలంలో ఆయనే చెప్పారు. చిన్ననాటి నుంచే ఆయనకు అలవడిన ఆ సత్యాన్వేషణ దృక్పథం ఎక్కడా రాజీపడకుండా జీవితాంతమూ కొనసాగింది.విద్యనూ, జ్ఞాన సముపార్జననూ జీవిత లక్ష్యాలుగా మలచుకున్నారు మహాత్మా పూలే. జ్ఞానం కొందరి గుత్తాధిపత్యం కాదనీ, ఆ శక్తి అందరికీ అందాలనీ స్పష్టంగా గుర్తించారాయన. సమాజంలో అనేకులకు అక్షర జ్ఞానం అందని ద్రాక్షగా ఉన్న ఆ కాలంలోనే బాలికల కోసం, విద్యావకాశాలు లేని వర్గాల కోసం పాఠశాలలను తెరిచి విద్యా విప్లవానికి నాంది పలికారు. "తల్లి ద్వారా బిడ్డకు అందే సంస్కారం అమూల్యమైనది. అందుకే, పాఠశాలలు తెరవాలనుకుంటే మొదట బాలికల కోసమే తెరవాలి" అనేవారాయన. సామాజిక న్యాయాన్నీ, సమానత్వాన్నీ సాధించే శక్తిమంతమైన సాధనంగా తరగతి గదిని నిలిపి.. ఓ సరికొత్త సామాజిక దృక్పథాన్ని ఆవిష్కరించేందుకు ఆయన ఎంతగానో కృషిచేశారు.విద్య పట్ల ఆయన దార్శనికత మనందరికీ స్ఫూర్తిదాయకం. దేశ యువతలో పరిశోధన, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా గత పదేళ్లుగా మేమెంతో కృషి చేశాం. ప్రశ్నించేలా, అన్వేషించేలా, నూతన ఆవిష్కరణలు చేసేలా యువతరాన్ని ప్రోత్సహించే పటిష్ఠమైన వ్యవస్థను నిర్మిస్తున్నాం. విజ్ఞానం, నైపుణ్యాలు, అవకాశాల్లో పెట్టుబడుల ద్వారా.. సమస్యల పరి ష్కర్తలుగా, దేశ ప్రగతికి సారథులుగా భారత్ తన యువతను సశక్తులుగా తీర్చిదిద్దుతోంది.మహాత్మా పూలే తన విజ్ఞానంతో, వివేకంతో... వ్యవసాయం, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలపై విస్తృత అవగాహనను పెంపొందించుకున్నారు. రైతులు, కార్మికులకు అన్యాయం జరిగితే మన సమాజం బలహీనపడుతుందని ఆయనెప్పుడూ చెప్పేవారు. పొలాల నుంచి పల దాకా.. రోజువారీ జీవితంలో సామాజిక అసమానతల తీవ్రతను ఆయన నిశితంగా గమనించారు. అందుకే పేదలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడడంలో ఆయన పూర్తిగా నిమగ్నమయ్యారు. అలాగే సామాజిక సామరస్యం కోసం శక్తివంచన లేకుండా నిర్విరామంగా కృషి చేశారు."జోపర్యంత సమాజాతీల సర్వానా సమాన అధికార మిళత్ నహీత్, తోపర్యంత ఖరే స్వతంత్ర్య మిళత్ నహీ (సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేంత వరకు నిజమైన స్వేచ్ఛను సాధించలేము)" అన్నది మహాత్మా పూలే అభిప్రాయం. సమ సమాజం లక్ష్యంగా.. ఈ ఆశయాన్ని కార్యాచరణగా మలిచే దిశగా ఎన్నో సంస్థలను ఆయన నెలకొల్పారు. ఆయన స్థాపించిన సత్యశోధక సమాజం ఆధునిక భారతదేశంలో అత్యంత ముఖ్యమైన సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో ఒకటి. సామాజిక సంస్కరణ, సమాజ సేవ, మానవ గౌరవాన్ని పెంపొందించడంలో ఇది అగ్రగామిగా నిలిచింది. మహిళలు, యువత, గ్రామీణ ప్రజలకు గొంతుకైంది. న్యాయం, ప్రతి వ్యక్తికీ గౌరవం, సమష్టి పురోగతి స్ఫూర్తిని కేంద్రంగా నిలపడం ద్వారా.. సమాజాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దవచ్చన్న మహాత్మా పూలే విశ్వాసానికి ఈ ఉద్యమం నిదర్శనం.ఆయన వ్యక్తిగత జీవితమూ ధైర్యసాహసాలను బోధించే పాఠమే. నిరంతరం జనబాహుళ్యంలో ఉంటూ ప్రజల కోసం పరితపించడం ఆయన ఆరోగ్యంపై ప్రభావం చూపింది. అత్యంత క్లిష్టమైన అనారోగ్య సమస్యలు కూడా ఆయన సంకల్పాన్ని సడలించలేకపోయాయి. పక్షవాతం బారిన పడి శరీరం సహకరించని స్థితిలోనూ తన కృషిని కొనసాగించారు. అవును, ఆయన శరీరం కఠిన పరీక్షను ఎదుర్కొని ఉండవచ్చు.. కానీ సమాజం పట్ల ఆయన నిబద్ధత మాత్రం సడలలేదు. ఆయన జీవితంలోని ఈ అకుంఠిత దీక్షే.. నేడు ఎన్నో కష్టాలకోర్చి, పోరాటాన్ని కొనసాగిస్తున్న లక్షలాది మందికి స్ఫూర్తినిస్తోంది.గౌరవ సావిత్రీబాయి పూలేను స్మరించుకోకుండా మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి అసంపూర్ణమే అవుతుంది. దేశం గర్వించదగ్గ అగ్రశ్రేణి సంస్కర్తల్లో ఆమె ముందు వరుసలో నిలుస్తారు. దేశపు తొలితరం మహిళా ఉపాధ్యాయినిగా, బాలికా విద్యా వికాసంలో ఆమె నిర్ణయాత్మక పాత్ర పోషించారు. తద్వారా వారు కలలను సాకారం చేసుకునే అవకాశాన్నిచ్చారు. మహాత్మా పూలే మరణానంతరమూ.. ఆ ఆశయ దీప్తిని సావిత్రీబాయి ఆరనివ్వలేదు. 1897లో ప్లేగు వ్యాధి విరుచుకుపడిన తరుణంలో.. బాధితుల సేవలో ఆమె పునరంకితమయ్యారు. చివరకు అదే వ్యాధికి గురై ప్రాణాలు విడిచిన త్యాగమూర్తి ఆమె.మనది పుణ్యభూమి. విశిష్టమైన భావాలు, నిరుపమాన త్యాగాలు, అకుంఠిత దీక్షతో మన సమాజాన్ని శక్తిమంతంగా మలచిన మహనీయులు, వీరనారులకు నిలయమిది. మార్పు ఎక్కడినుంచో మొదలవుతుందని ఎదురుచూడలేదు. వారే మార్పునకు నాంది పలికారు. శతాబ్దాల నుంచి దేశంలో సామాజిక పురోగతి దిశగా.. మన సమాజం నుంచే శంఖారావం వినిపించింది. పీడితుల వ్యథను గుర్తించి.. దానిని 'తలరాత' అని సరిపెట్టుకోకుండా ఎదురుతిరిగిన వారి నుంచి ఆ చైతన్యం పుట్టుకొచ్చింది. అలాంటి యోధుల్లో ఒకరు మహాత్మా జ్యోతిరావు పూలే.2022లో పూణే పర్యటన సందర్భంగా.. అక్కడి మహాత్మా పూలే భవ్య విగ్రహం వద్ద నివాళి అర్పించడం నాకెప్పటికీ గుర్తుంటుంది. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభ వేళ.. ఆయన ఆశయాల దిశగా పునరంకితం కావడమే మనం అర్పించే ఘనమైన నివాళి. ముఖ్యంగా ఆయనకెంతో ఇష్టమైన విద్య వంటి ఆదర్శాలకు మనం పునరంకితం కావాలి. అన్యాయంపై నిరసన తెలిపే సున్నితత్వాన్ని పెంచుకోవాలి. సమాజ స్వయం సంస్కరణ సామర్థ్యంపై మన విశ్వాసాన్ని బలంగా చాటాలి. నైతిక స్పష్టత, ప్రజా ప్రయోజనం రెండూ తోడైతే.. ఈ సమాజ శక్తి దేశంలో అద్భుతాలు సృష్టించగలదని ఆయన జీవితం నిరూపించింది. అందుకే నేటికీ లక్షలాది మందికి ఆయన ఆలోచనలు బలాన్నిస్తున్నాయి. ఆయన మాటలూ, చర్యలూ నేటికీ ఆశను చిగురింపజేస్తున్నాయి. ఆయన జన్మించి దాదాపు రెండు వందల ఏళ్లు గడుస్తున్నా -- మహాత్మా జ్యోతిరావు పూలే గత కాలపు శక్తిగానే కాకుండా.. నవ భారత భవితకు మార్గదర్శిగా విరాజిల్లుతున్నారు.



## కేరళలో భారీగా పోలింగ్ నమోదు..

దక్షిణ భారత రాష్ట్రం కేరళలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈసారి భారీ స్థాయిలో పోలింగ్ నమోదైంది. మొత్తం 140 స్థానాలకు గాను సుమారు 78.27 శాతం ఓటింగ్ నమోదవ్వడం విశేషం. గత 2021 ఎన్నికలతో పోలిస్తే ఇది 2.27 శాతం పెరుగుదలగా భావిస్తున్నారు. అదే సమయంలో కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో 30 స్థానాలకు గాను 89.87 శాతం ఓటింగ్ నమోదై రికార్డు సృష్టించింది. అయితే, కేరళ రాజకీయాల్లో ఓటింగ్ శాతం పెరగడం సాధారణంగా అధికార మార్పుకు సంకేతంగా పరిగణించబడుతోంది. ఈ నేపథ్యంలో ఈసారి పెరిగిన ఓటింగ్ శాతం ప్రస్తుత రాజకీయ సమీకరణాలను ఎలా ప్రభావితం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం మళ్లీ అధికారాన్ని నిలుపుకుంటుందా లేదా యూడీఎఫ్‌కు అవకాశాలు పెరుగుతాయా అన్నది చర్చనీయాంశంగా మారింది.గత ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే, కేరళలో ఓటింగ్ శాతం పెరిగినప్పుడల్లా ప్రభుత్వ మార్పు జరిగిన సందర్భాలు ఎక్కువగా కనిపిసాయి. 2011, 2016 ఎన్నికల్లో కూడా ఓటింగ్ శాతం పెరిగిన తర్వాత అధికార మార్పు జరిగింది. అయితే 2021లో ఈ ధోరణిని ఎల్‌డీఎఫ్ బ్రేక్ చేసి వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చింది. ఈసారి నమోదైన 78.27 శాతం ఓటింగ్ గత 49 ఏళ్లలో రెండో అత్యధికంగా నిలిచింది. 1977లో 79.2 శాతం ఓటింగ్ నమోదై ఇప్పటికీ రికార్డుగా ఉంది. ఈ గణాంకాలు చూస్తే, ఈసారి ఓటర్ల పాల్గొనిక ఎంతో ఎక్కువగా ఉందని స్పష్టమవుతోంది.రాష్ట్రంలోని 14 జిల్లాల్లో ఎక్కువ భాగంలో 70 శాతం పైగా పోలింగ్ నమోదవగా, కోజికోడ్ జిల్లాలో అత్యధికంగా 81.32 శాతం ఓటింగ్ నమోదైంది. పతనంతిట్టలో మాత్రం కనిష్టంగా 70.76 శాతం నమోదైంది. ఈ గణాంకాలు మొత్తం రాష్ట్రంలో ఓటర్ల చురుకుదనాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక, ఈసారి ఎన్నికలు సర్ ప్రక్రియ ఆధారంగా నిర్వహించబడడం కూడా ఓటింగ్ శాతం పెరగడానికి ఒక కారణంగా భావిస్తున్నారు. డూప్లికేట్ లేదా చెల్లని ఓట్లను తొలగించడం వల్ల అసలు ఓటర్ల శాతం పెరిగిందని అంచనా వేస్తున్నారు.

### 1977 తర్వాత కేరళలో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైంది..

గత 49 ఏళ్లలో కేరళ శాసనసభ ఎన్నికల్లో రెండో అత్యధిక ఓటింగ్ నమోదైంది. ఈ ఏడాది రాష్ట్రంలో 78.27 శాతం ఓట్లు పోలయ్యాయి. 1977లో రికార్డు స్థాయిలో 79.2 శాతం ఓటింగ్ నమోదైంది. స్వాతంత్ర్యం తర్వాత కేరళలోని ఓటింగ్ సరళిని పరిశీలిస్తే, రాష్ట్రంలో తొలిసారిగా 1957లో ఎన్నికలు జరిగాయి, అప్పుడు 65 శాతం ఓటింగ్ నమోదైంది. 1960 ఎన్నికలలో ఓటింగ్ శాతం 68.80 శాతం, 1965లో 72.40 శాతం, 1967లో 75.30 శాతం, 1970లో 73.50 శాతం, 1977లో 79.20 శాతం, 1980లో 75.80 శాతం మరియు 1982లో 73.50 శాతంగా నమోదైంది. అదేవిధంగా, 1987లో 74.60 శాతం, 1991లో 73.30 శాతం, 1996లో 70.80 శాతం, 2001లో 72.30 శాతం మరియు 2006లో 74.60 శాతంగా ఓటింగ్ శాతం నమోదైంది. ఇదిలా ఉండగా, 2011లో ఓటింగ్ శాతం 75.10 శాతం, 2016లో 77.40 శాతం, 2021లో 76 శాతంగా నమోదైంది. ఈసారి, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 78.27గా నమోదైంది. తుది గణాంకాలు విడుదలైన తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

### ఈసారి అధికారాన్ని నిలుపుకునే ధోరణి తలక్రిందులైంది.

1980 నుండి కేరళలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి అధికారం మారుతూ వస్తున్న సంప్రదాయాన్ని, గత ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ తిప్పికొట్టింది. 1980 నుండి రాష్ట్రంలో ప్రతి ఐదేళ్లకు అధికారం మారుతూ వస్తోంది. ఈ రాజకీయ పార్టీ గానీ, కూటమి గానీ ఎన్నడూ వరుసగా గెలవలేదు. సారాంశంలో, ప్రతి ఐదేళ్లకు అధికారం మారుతూ వచ్చింది. 2021 ఎన్నికలలో సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ఈ సంప్రదాయానికి బ్రేక్ వేసింది. 1980 నుంచి కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్, వామపక్షాల నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ చెరొకసారి అధికారంలోకి వచ్చాయి. అయితే, 2021లో వామపక్షాలు ఈ సంప్రదాయాన్ని బ్రేక్ చేసి వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చాయి. ఈ సరళిని గమనిస్తే, ఓటింగ్ శాతం పెరిగినప్పుడల్లా ప్రభుత్వం చేతులు మారింది, ఓటింగ్ శాతం తగ్గినప్పుడల్లా అధికారంలో ఉన్న పార్టీ తన ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడంలో విజయం సాధించింది.

### 2.27 శాతం ఓట్ల వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం?


కేరళ రాజకీయాల్లో కేవలం 2.5 శాతం ఓట్లు మొత్తం ఆటనే మార్చేయగలవు. ఇది అర్థం చేసుకోవాలంటే, గత 15 ఏళ్ల ఎన్నికల సరళిని పరిశీలించాలి. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 75.10గా నమోదైంది, ఇది 2006తో పోలిస్తే ఒక శాతం ఎక్కువ. కేరళలో అధికారం చేతులు మారింది, వామపక్షాలు అధికారం నుండి దిగిపోగా, కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. ఐదు సంవత్సరాల తరువాత, 2016 కేరళ అసెంబ్లీ ఎన్నికలలో, 2011 ఎన్నికలతో పోలిస్తే రెండు శాతం అధికంగా, ఓటింగ్ శాతం 77.40గా నమోదైంది. ఈ పెరిగిన ఓటింగ్ శాతం అధికార మార్పుకు దారితీసింది. యూడీఎఫ్ కూలదోయబడగా, వామపక్షాలు తిరిగి అధికారంలోకి వచ్చాయి. ఆ తరువాత, 2021 అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు, 2016తో పోలిస్తే ఓటింగ్ శాతం 1.25 శాతం తక్కువగా నమోదైంది. 2016లో ఓటింగ్ శాతం 77.40గా ఉండగా, 2021లో అది 76 శాతంగా ఉంది. ఈ విధంగా, తగ్గిన ఓటింగ్ శాతం వల్ల వామపక్షాలు లబ్ధి పొంది అధికారంలోనే కొనసాగాయి. ఈ విధంగా, గత 40 ఏళ్లుగా కొనసాగుతున్న అధికార మార్పుల ధోరణిని వామపక్షాలు తిరగరాశాయి.

### ఎన్నికలలో ఓటింగ్ శాతం పెరగడానికి, తగ్గడానికి సంకేతాలు ఏమిటి?

ఓటింగ్ శాతంలో పెరుగుదల లేదా తగ్గుదల ఎన్నికల ఫలితాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. భారత ఎన్నికల చరిత్రలో, ఓటింగ్ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని (ప్రభుత్వ వ్యతిరేకత) సాధారణంగా నమ్ముతారు. అయితే, ఇది ఎల్లప్పుడూ నిజం కాదు. ఎన్నికలలో అధిక ఓటింగ్ శాతం కొన్నిసార్లు ప్రభుత్వానికి మద్దతును (ప్రభుత్వ అనుకూలత) కూడా సూచిస్తుందని గమనించబడింది. అయితే, ఓటింగ్ శాతం పెరగడం ఎప్పుడూ ప్రభుత్వ వ్యతిరేకతకే సంకేతం అవుతుందనే చెప్పలేం. కొన్నిసార్లు అది ప్రభుత్వానికి మద్దతుగా కూడా మారవచ్చు. అందువల్ల ఈసారి పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి అనుకూలంగా మారుతుందో ఫలితాలు వెలువడే వరకు వేచి చూడాల్సిందే. మొత్తం మీద, కేరళలో ఈసారి నమోదైన భారీ పోలింగ్ రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశముంది. ఈ 2.27 శాతం పెరుగుదల ఎవరికి లాభం చేకూరుస్తుందో త్వరలోనే స్పష్టత రానుంది.

## ఎన్నికల వేళ 'మహిళా' వ్యూహం!

పార్లమెంటు ఉభయ సభలూ ఏప్రిల్ 2న, బడ్జెట్ సమావేశాల్లో సాధారణంగా జరిగే ఆర్థిక వ్యవహారాలపై చర్చలు, సంబంధిత బిల్లుల ఆమోదం ముగిసిన తరువాత వాయిదా పడ్డాయి. పార్లమెంటు వాయిదాకు అది సరైన సమయం. ఎందుకంటే ఏప్రిల్ 9న అసోం, కేరళ రాష్ట్రాలలోను, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలోను అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగింది. అంతేకాకుండా తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల పర్వం మార్చి 30న ఆరంభమయింది. ఆ రెండు రాష్ట్రాలలో పోలింగ్ ఏప్రిల్ 23న (తమిళనాడు), ఏప్రిల్ 29న (పశ్చిమ బెంగాల్) జరగనున్నది తమ తమ నియోజకవర్గాలకు తిరిగి వెళ్లేందుకు ఎంపీలు సహజంగానే ఆరాటపడుతున్నారు. ఏప్రిల్ మాసాంతంలోగా అత్యవసర ప్రాతిపదికన నిర్వహించవలసిన చర్చలు గానీ, ఆమోదించవలసిన బిల్లులు గానీ లేవు.పార్లమెంటు అత్యవసరంగా చర్చించాల్సిన అంశాలు గానీ, చేపట్టాల్సిన కార్యక్రమాలు గానీ నిజంగానే ఏవీ లేవు. ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియను మరెలాంటి దుస్సాహసాలకు తావులేకుండా ముగించడమే అసంపూర్ణంగా ఉన్న కర్తవ్య పాలన. 'ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్) ఒక దుస్సాహసం కాదు, అది ఉద్దేశపూర్వక దుశ్చేష్ట. లక్షలాది ఓటర్ల ఓటుహక్కును గంపగుత్తగా తొలగించేందుకు ఉద్దేశించిన కార్యక్రమమది. చెదురుమదురుగా ఆవేశభరిత, విద్వేషపూరిత రాజకీయ ప్రసంగాలు మినహా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగుతోంది. పశ్చిమ బెంగాల్ 'సర్'పై న్యాయపోరాటం సర్వోన్నత న్యాయస్థానంలో జరుగుతోంది. 'సర్' ప్రభావిత రాష్ట్రాలలో సగటున 10శాతం మంది వయోజన జనాభాను ఓటర్ జాబితాల నుంచి తొలగించడం జరిగిందనే విషయాన్ని ఎవరూ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లలేదు. 'సర్' ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాలలో కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ కూడా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పెద్ద రాష్ట్రాలు తమిళనాడు (234 సీట్లు), పశ్చిమ బెంగాల్ (294 సీట్లు)లో పోలింగ్ లోగా ఏదో ఒక వివాదాన్ని సృష్టించాలనే ఆలోచన బీజేపీ అగ్రనాయకులకు వచ్చినట్టున్నది. '106వ రాజ్యాంగ సవరణ చట్టం అమలు' విషయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో చర్చించమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిని ఆదేశించి ఉంటారు. పార్లమెంటు ఆ చట్టాన్ని సెప్టెంబర్ 2023లో ఆమోదించింది. దాని అమలుపై 30 నెలల పాటు స్తబ్దుగా ఉన్న ప్రభుత్వం ఇప్పుడు హఠాత్తుగా మేల్కొంది. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి, ప్రతిపక్షాల నాయకుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. ఏప్రిల్ 29న అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని మల్లికార్జున్ ఖర్గే సూచించారు. మార్చి 26న మంత్రి రాసిన లేఖ ఆసక్తికరంగా ఉన్నది: 'ఆ సూచనను పాటిస్తే పార్లమెంటు, శాసనసభల్లో మహిళా రిజర్వేషన్ల అమలులో జాప్యం జరగవచ్చని', 2029 సాధారణ ఎన్నికలకుగాను ఆ చట్టంలోని అంశాల అమలు సాధ్యాసాధ్యాలను ప్రతికూలంగా ప్రభావితం చేయవచ్చని' మంత్రి పేర్కొన్నారు. దరిమిలా మహిళా రిజర్వేషన్లపై చర్చించేందుకు ఏప్రిల్ 16 నుంచి మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.పార్లమెంటులో మహిళా రిజర్వేషన్లను శీఘ్రగతిన అమలుపరచాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎప్పుడు సంకల్పించుకున్నది? సెప్టెంబర్ 2023లో 106వ రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందినప్పుడు కాదని నిశ్చితంగా చెప్పవచ్చు. మహిళా రిజర్వేషన్లను 2029 అనంతరం కాని అమలుపరచడం సాధ్యంకాదని సూచించే మాటలతో ఆ బిల్లుకు రూపకల్పన జరిగింది. మహిళా రిజర్వేషన్ల అమలుపై ఆనాడు రాజ్యసభలో నేను సంధించిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానమివ్వనేలేదు.మరి ఇప్పుడు హఠాత్తుగా మహిళా రిజర్వేషన అమలుపై ప్రభుత్వం ఎందుకు శ్రద్ధ చూపుతున్నది? చాలా ఆతురత పడుతోంది సుమా! ఏప్రిల్ 16 నుంచి మూడు రోజుల పాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలలో లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచేందుకు ఉద్దేశించిన బిల్లును ప్రవేశపెట్టనున్నదని తెలుస్తోంది. ఇందుకు ఒక రాజ్యాంగ సవరణ బిల్లును ప్రత్యేక మెజారిటీతో ఉభయ సభల్లో ఆమోదం పొందవలసి ఉన్నది. సభలోని మొత్తం సభ్యులలో సగం మందిగానీ లేదా సమావేశాలకు హాజరైన సభ్యులలో మూడింట రెండు వంతుల మందిగానీ ఆ బిల్లును బలపరచవలసి ఉన్నది. లోక్‌సభలో భారతీయ జనతా పార్టీ, దాని మిత్రపక్షాలకు, మద్దతునిచ్చే ఇతర పక్షాలకు కలిపి మూడింట రెండువంతుల మెజారిటీ లేదు. అయినా ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల విషయమై మున్నెన్నడు చూపని తెగువను ప్రదర్శిస్తోంది. ఎందుకు? ఏప్రిల్ 23న పోలింగ్ జరగనున్నందున తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రతిపక్ష ఎంపీలు సమావేశాలకు రాలేక పోవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా ఉన్నది. లోక్‌సభలో సభ్యుల సంఖ్య పెంపుదలకు సబంధించిన బిల్లు ఆమోదం పొందినా పొందకపోయినా ఆ అంశాన్ని ఎన్నికల ప్రచారంలో తప్పక ఉపయోగించుకుంటుంది. బిల్లు ఆమోదం పొందితే మహిళా సభ్యుల సంఖ్య 182 నుంచి 272కు పెరుగుతుందని ఇందుకు తమ ప్రభుత్వం చూపిన చొరవే కారణమని బీజేపీ ప్రజలకు చెప్పుతుంది. ఒకవేళ ఆమోదం పొందక పోతే అందుకు ప్రతిపక్షాలను తప్పుపడుతుంది.లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచాలన్న ప్రతిపాదన అమలులోకివస్తే ఉత్పన్నమయ్యే సంభావ్య ప్రతికూలతలను బీజేపీ పరిగణనలోకి తీసుకోవడం లేదు.. లోక్‌సభను నిర్వహించడం కష్టతరమవుతుంది. ఒక సభ్యుడికి మాట్లాడే అవకాశం అరుదుగా, అందునా కొద్ది నిమిషాల పాటు మాత్రమే లభిస్తుంది. మరీ ముఖ్యంగా జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలు, జనాభా పెరుగుదలను స్థిరీకరించిన దక్షిణాది రాష్ట్రాల ఓటింగ్ బలాల మధ్య వ్యత్యాసం పెరిగిపోతుంది. ఇది అనివార్యంగా రాజకీయ ఘర్షణలకు దారితీస్తుంది. 'విభజించి పాలించు' అనే బీజేపీ స్వకల్పిత కుయుక్తికి ఇదొక తార్కాణం. లోక్‌సభ సభ్యుల సంఖ్య పెంపుదల చర్చకు యోగ్యమైన ఆలోచనే. అయితే ఆ చర్చకు నిర్ణయించిన సమయమే గర్హనీయం.



# కాళేశ్వరానికి 'రిపేర్'

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని వేల కోట్ల రూపాయలు అప్పు చేసి మరీ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. తద్వారా లక్షల ఎకరాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల నిర్మాణానికి సిద్ధం అయితే.. అక్కడ నీటి లభ్యత లేదనే సాకుతో లొకేషన్‌ను కాళేశ్వరానికి మార్చారు. అయితే.. వేల కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ప్రాజెక్టులోని బ్యారేజీ పిల్లర్లు గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుంగుబాటుకు గురైన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు అవకతవకలపై కమిషన్ వేసి విచారణ చేయించింది. ఈ క్రమంలో తాజాగా ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్ పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యారేజీలకు మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే అన్ని మరమ్మతులు పూర్తి చేసి, అవసరమైన సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

**మరమ్మతులు వేగవంతం..**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం తాజాగా సమీక్ష చేయడంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతు పనులు వేగవంతంగా కానున్నాయి. ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో లక్షల ఎకరాల సాగు నీరు అందనుంది. అయితే.. ప్రాజెక్టు పడావు పడినప్పటి నుంచి సుమారు 8 లక్షల ఎకరాల వరకు సాగు పరిస్థితి ప్రశ్నార్థకమైంది. తాజాగా.. సీఎం ఆదేశాలతో నీటి సరఫరా పునరుద్ధరించే విషయం రైతాంగానికి కొంత ఊరటనిస్తోంది. అదేస్థాయిలో ఈసారి నిజంగా గడువులో పూర్తవుతాయా? అనే ప్రశ్న రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచించిన విధంగా పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేక కార్యాచరణను రూపొందించి నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తిచేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. అటు నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్స్‌తో టీమ్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.

**నిర్మాణ సంస్థల ఉద్దేశమేంటి..?..**

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణలో నిర్మాణ సంస్థల స్పందన అత్యంత కీలకంగా మారింది. భారీ స్థాయిలో సాంకేతిక మరమ్మతులు, నిర్మాణపరమైన బలపరిచే పనులు అవసరమవుతున్న నేపథ్యంలో చేపట్టేందుకు సంస్థలు ముందుకు వస్తాయా? అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మిగిలింది. గతంలో ఎదురైన సాంకేతిక సమస్యలు, ఒత్తిడి, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అనిశ్చితి కలిసి కాంట్రాక్టర్లలో అభద్రతా భావం నెలకొంది. ముఖ్యంగా మేడిగడ్డ వంటి కీలక నిర్మాణాల్లో లోపాలు బయటపడిన తర్వాత, మరమ్మతులు సాధారణ పనులు కాకుండా అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్ సవాళ్లుగా మారాయి. అంతేకాకుండా.. వాటిని నిర్మించిన సంస్థలే వాటికి రిపేర్లు చేయాలని మొదటి నుంచీ ప్రభుత్వం చెబుతూ వస్తున్నది. అయితే.. ఈ ఆదేశాలకు మాత్రం నిర్మాణ సంస్థలు పెద్దగా ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో మరోసారి వాటి వైఖరి మీదనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. కాగా నీటి సరఫరా పునరుద్ధరించకపోతే అధిక విస్తీర్ణంలో సాగు వ్యవస్థ సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తున్నది.

**వానాకాలంలోపే సవాల్..**

కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణలో సమయమే ప్రస్తుతం అతిపెద్ద సవాల్‌గా మారింది. వరదల సీజన్ వేగంగా దగ్గరపడుతున్న నేపథ్యంలో పరిమిత గడువులోనే విస్తృత స్థాయి మరమ్మతులు పూర్తి చేయాల్సిన పరిస్థితి అధికారుల ముందుంది. ఒకవైపు దెబ్బతిన్న బ్యారేజీలు, పంప్ హౌస్‌లో సాంకేతిక సమస్యలు, మరోవైపు క్లిష్టమైన ఇంజినీరింగ్ పనులు.. ఈ రెండింటినీ సమాంతరంగా పూర్తి చేయడం పెద్ద పరీక్షగా మారింది. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజ్‌ని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఇంజినీర్లు చెబుతున్నారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వాల్సి ఉంది. ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాల్సి ఉంది. పనుల ప్రణాళిక, టెండర్లు, నిర్మాణ సంస్థల ఎంపిక, యంత్రాంగం సమీకరణ వంటి ప్రతి దశలో ఆలస్యం జరిగే అవకాశాలు ఉండటంతో గడువు మరింత కఠినంగా మారింది. అయితే.. నిధుల విషయంలోనూ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని సీఎం భరోసా ఇవ్వడంతో పనులు సైతం చకచకా జరిగే అవకాశాలే కనిపిస్తున్నాయి.

# 'నారీ శక్తి'దే రాజ్యం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో.. అక్కడ దేవతలు కొలువై ఉంటారని నమ్మే సంప్రదాయం భారతదేశ సంప్రదాయమని ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఏళ్ళ తరబడి ఎదురుచూస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టబోతున్నారు. మహిళా సంక్షేమనికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. నారీ శక్తి వందన్ అధినియం చట్టాన్ని తీసుకువచ్చి మహిళలకు 33 రిజర్వేషన్ కల్పించాలని చిత్తశుద్ధితో ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు వెళ్తున్నారు. 2029 సాధారణ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని పార్లమెంట్ సమావేశాలు ఏప్రిల్ 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఎవరు చేయని పని మోడీ చేస్తున్నారు. ఎన్నో ఏళ్ళు పాలించిన కాంగ్రెస్ కూడా చేయలేకపోయింది. బిల్లు అమలు చేసినప్పుడే ఆ బిల్లుకు సార్థకత. పార్లమెంట్ సమావేశాల్లో అన్ని పార్టీల సభ్యులు పార్టీలకు అతీతంగా మహిళా రిజర్వేషన్ బిల్లును మద్దతు తెలపాలి. 2029లో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి వచ్చేలా సహకరించాలి. ఇది ఒక సాధారణ బిల్లు కాదు. కోట్లాది మంది ఆడబిడ్డల ఆశయం. ఈ బిల్లు రాజకీయాల్లో కొత్త నాంది.

**అభివృద్ధి వైపు అడుగులు..**

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు అయితే.. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత.. పార్లమెంట్ స్థానాలు 17 స్థానాల నుంచి 26 స్థానాలకు పెరుగుతాయి. అందులో 9 మంది ఎంపీలు తెలంగాణ నుంచి ఉంటారు. 273 మంది మహిళలు దేశవ్యాప్తంగా పార్లమెంట్‌కి వస్తారు. తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 180కి పెరుగుతాయి. అందులో 60 మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో కూర్చునే అవకాశం దక్కుతుంది. అసెంబ్లీ, పార్లమెంట్ చట్టసభల్లో పెద్ద సంఖ్యలో మహిళల ప్రతినిధ్యం పెరుగుతుంది. దేశ రాజకీయాల్లోకి మహిళలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం కల్పిస్తోంది. గతంలో వంటింటికి పరిమితమైన మహిళలు.. అనేక రంగాలలో వచ్చిన అవకాశాలను తన శక్తిని నిరూపించుకుంది. దేశ రాజకీయాల్లో అనేక మార్పులు వస్తాయి. పెద్ద ఎత్తున అభివృద్ధి వైపు అడుగులు వేయగలుగుతాం. ఒక తల్లిగా కుటుంబాన్ని అన్ని రకాలుగా ముందుకు తీసుకెళ్లడంలో సమర్థవంతంగా, చక్కగా వ్యవహరిస్తూ.. ముందుకు వెళ్తోంది. చట్ట సభలో మహిళల సంఖ్య పెరిగితే మహిళా ఆర్థిక, ఉపాధి, రక్షణలలో కీలక మార్పులు వస్తాయి. అనేక మంది మహిళలు రాజకీయాల్లో తమ నాయకత్వాన్ని రుజువు చేసుకున్నారు. ఏ రంగంలో అయినా రాణించగలం అని రుజువు చేస్తున్నారు. 40 ఏళ్లుగా మహిళా సాధికారత అని ప్రగల్భాలు కాంగ్రెస్ పలికింది. కనీసం ఇప్పుడైనా మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు తెలుపాలి. మహిళా రిజర్వేషన్ బిల్లు అడ్డుకోవాలని అనేక మంది కుట్రలు పన్నుతున్నారు. మహిళల గౌరవం పెంచేలా అన్ని రకాలుగా ప్రధాని మోడీ కృషి చేస్తున్నారు. ప్రధాని అయిన నాటినుంచి అనేక కార్యక్రమాలు చేస్తున్నారు.

**పేద కుటుంబాల్లో గుణాత్మక మార్పు..**

మహిళల ఆత్మగౌరవం పెంచేలా.. స్వచ్ భారత కింద 12వేల కోట్ల ఇండ్లకు టాయిలెట్స్ నిర్మాణం చేయించారు. పేద మహిళలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ అందించడం జరిగింది. జన్ ధన్ యోజన, స్టార్టాప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు ముద్ర రుణాలు అందిస్తున్నారు. వికాసిత్ భారత్ 2027 లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. దేశ GDP పెరుగుతుందని అంటే.. మహిళల భాగస్వామ్యం కీలకం. మహిళా శక్తి కి రాజకీయ శక్తి తోడైతే.. గ్రామీణ ప్రాంతాల్లో,రైతు, పేద కుటుంబాల్లో గుణాత్మక మార్పు వస్తుంది. ప్రపంచ దేశాల్లో అభివృద్ధి చెందిన దేశంగా నిలబడాలి అంటే.. మహిళాల భాగస్వామ్యం అవసరం. మహిళలను విద్య,ఆరోగ్యం,ఉపాధి, రక్షణ అన్నింటిలో ప్రోత్సాహకం కల్పిస్తుంది నరేంద్ర మోడీ ప్రభుత్వం. గర్భిణీ, బాలింతల కు పోషకాహారం అందిస్తుంది. క్యాన్సర్ బారిన కడకుండా.. వాక్సినేషన్ బాలికలకు అందిస్తుంది. బీజేపీకి పేరువస్తుందని.. ప్రత్యర్థులు కుళ్ళు బుద్ధితో అడ్డుకునే ప్రయత్నం చేయకుండా ఈ బిల్లుకు సహకరించాలి. మహిళలకు డ్రోన్ ట్రైనింగ్, స్టాండప్ ఇండియా కింద ప్రోత్సహిస్తుంది, దీదీ లక్పతి పథకం ఇలా అనేక పథకాలతో ప్రోత్సహిస్తుంది. మహిళలను గౌరవించే దేశం ఇది. ఈ బిల్లుకు అడ్డు పడకండి. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్‌లలో బీజేపీకి క్రెడిట్ వస్తుందని ఏది వాడితే అదీ మాట్లాడుతున్నారు. గతంలో కేసీఆర్ మాదిరి ఉత్తర, దక్షిణ రాష్ట్రాలని.. మాట్లాడారో అలాగే రేవంత్ రెడ్డి కూడా మాట్లాడుతున్నారు. అన్ని రాష్ట్రాల్లో జరిగినట్లు.. తెలంగాణలో సీట్ల పెంపు జరుగుతుంది. మహిళా బిల్లుకు అందరూ మద్దతు తెలుపుతూ.. మహిళలు, పురుషులు, యువత అందరి చిన్న వీడియో చేయాలి. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవన్నీ ఎందుకు గుర్తుకు రాలేదు.. ఇప్పుడే అందుకు మాట్లాడుతున్నారు. టీవీలలో బ్రేకింగ్ న్యూస్‌ల కోసం రేవంత్ రెడ్డి అలా మాట్లాడుతున్నారని డీకే అరుణ కీలక వ్యాఖ్యలు చేశారు.

# హైడ్రా భారీ ఆపరేషన్..




**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్ పూర్ మండలం ఐలాపూర్ లో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. 1200 ఎకరాల వివాదాస్పద ఇనాం భూముల సంరక్షణకు రంగంలోకి దిగింది. ఇప్పటికే దాదాపు 400 ఎకరాల వరకు కబ్జా అయ్యింది. కొందరు అక్రమార్కులు భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా పెద్ద ఎత్తున శనివారం వేకువజామున రంగంలోకి దిగింది. వందలాది పోలీసులు, హైడ్రా సిబ్బంది భారీ ప్రొక్లైనర్లు, ఇతర వాహనాలతో గ్రామానికి చేరుకున్నారు. వచ్చి రాగానే గ్రామంలో ఆరు అంతస్తుల భవనాన్ని కూల్చివేత ప్రారంభించారు. అలాగే అడ్వకేట్ ముఖీంకు చెందిన గెస్ట్ హౌజ్‌ను కూడా కూల్చి వేస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వారికి ముందస్తుగానే నోటీసులు ఇచ్చినట్లు హైడ్రా అధికారులు చెబుతున్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి దాదాపు 830 ఎకరాలకు పెన్సింగ్ ఏర్పాటు చేయడానికి హైడ్రా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**హైడ్రాకు ప్లకార్డులతో మద్దతు..**

ఐలాపూర్‌లో హైడ్రా కూల్చివేతలకు గ్రామస్తులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ భూముల కబ్జా అరికట్టాలని పెద్ద ఎత్తున గ్రామస్తులు ప్లకార్డులు పట్టుకుని మద్దతు పలికారు. పలువురు యువకులు పటాకులు పేల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి గ్రామస్తులు పాలాభిషేకం కూడా చేశారు. ఐలాపూర్ లో వందల ఎకరాల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని కాపాడాలని గ్రామస్తులు హైడ్రా అధికారుల విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కూల్చివేతలు ఎంత వరకు కొనసాగుతాయని, పరిణామాలు ఎలా ఉంటాయే చూడాల్సి ఉంది. ఈ కూల్చివేతలతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

# మోడీ-రాహుల్‌గాంధీ సంభాషణ



**ఢిల్లీ :** పార్లమెంట్ వేదికగా ప్రధాని మోడీ-ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరూ చాలా సేపు సంభాషించుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. శనివారం మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి. ఈ సందర్భంగా పార్లమెంట్ ప్రాంగణంలోని 'ప్రేరణ స్థల్'లో ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి మోడీ, రాహుల్ గాంధీ నివాళులర్పించారు. తొలుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపాధ్యక్షుడు సీపీ రాధాకృష్ణన్ నివాళులర్పించగా.. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకముందు ప్రధాని మోడీ పార్లమెంట్ ప్రాంగణానికి చేరుకున్నాక అక్కడే వేచి ఉన్న రాహుల్ గాంధీకి నమస్కరించారు. అనంతరం ఇద్దరూ కలిసి పలు విషయాలపై సంభాషించారు. మోడీ మాట్లాడుతుండగా.. రాహుల్ గాంధీ తల ఊపుతూ సమాధానం ఇస్తున్నట్లుగా వీడియోలో కనిపించింది. అయితే మోడీ.. యోగక్షేమాలు తెలుసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం దేశంలో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్-బీజేపీ విమర్శలు.. ప్రతి విమర్శలతో వాగ్యుద్ధం జరుగుతోంది. అంతేకాకుండా పార్లమెంట్ సమావేశాల్లో రెండు ప్రధాన పార్టీల మధ్య పెద్ద ఫైటింగే జరుగుతోంది. ఇలాంటి తరుణంలో మోడీ-రాహుల్ గాంధీ మాట్లాడుకోవడం ఆసక్తి రేపింది.

# తప్పుడు ప్రచారం ఆపెయ్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఇవాళ ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశామని తుమ్మల క్లారిటీ ఇచ్చారు. 40 బ్యాంకులు పంపిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని ప్రతి రైతుకూ రుణమాఫీ చేశామని తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా జమచేసిన ఘనత తమ ప్రభుత్వానిదని తెలిపారు. గతంలో నెలల తరబడి రైతుబంధు వేశారంటూ దుయ్యబట్టారు. రెండు పంటల కాలంలోనే రైతుల కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం తమదేనని అన్నారు. రైతుల కోసం ఈ స్థాయిలో ఖర్చు చేసే ప్రభుత్వమేదో హరీశ్ రావు చెప్పాలని ప్రశ్నించారు.

# బీసీ బిడ్డ మంత్రి అయితే ఓరుస్తలేవా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్ 2.0 పథకం నిధులతో అమరచింత పెద్ద చెరువు సుందరీకరణ పనులకు సంబంధించి ప్రోటోకాల్ వివాదం సవాళ్లు, ప్రతి సవాళ్లకు దారితీసింది. ఈ క్రమంలోనే మక్తల్ అభివృద్ధికి కేంద్రం ఎన్ని నిధులు ఇచ్చిందో, రాష్ట్రం ఏమిచ్చిందో చర్చకు రావాలని డీకే అరుణ , మంత్రి వాకిటి శ్రీహరి కి సవాలు విసిరారు. ఈ సందర్భంగా డీకే అరుణ వ్యాఖ్యలకు మంత్రి వాకిటి స్పందించారు. ఇవాళ ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. డీకే అరుణ రౌడీయిజం గురించి పాలమూరు జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారంటూ సెటైర్లు వేశారు. తాను డీకే అరుణ విసిరిన సవాలును స్వీకరిస్తున్నానని ఆయన అన్నారు. మక్తల్ అభివృద్ధికి నిధుల కేటాయింపుపై చర్చకు సిద్ధమని ప్రతి సవాలు విసిరారు. ఇప్పటికే ప్రారంభించిన కార్యక్రమానికే మళ్లీ శంకుస్థాపన చేయడానికి ప్రయత్నిస్తే



అడ్డుకున్నారని అన్నారు. తాను మొదటి నుంచి ఒకే పార్టీలో ఎదిగానని, ప్రోటోకాల్ గురించి తెలుసని పేర్కొన్నారు. ఒక బీసీ బిడ్డ మంత్రి అయితే డీకే అరుణ ఓర్వలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. తనకు మహిళల పట్ల గౌరవం ఉందని, తాను డీకే అరుణను అవమానించలేదని మంత్రి వాకిటి శ్రీహరి క్లారిటీ ఇచ్చారు.

# పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో ఫోన్‌లు ఇవ్వొద్దు..




**ములుగు,ఫ్లాష్ ఇండియా :** పిల్లలకు తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో సెల్ ఫోన్‌లు ఇవ్వకుండా మంచి పౌష్టికాహారం అందించే విధంగా చూడాలని, పౌష్టికాహారం విలువలు తెలియజేయడానికే రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల పాటు పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐలవ్‌యు ములుగు అనే స్వాగత తోరణం వద్ద పోషకాహారంపై వివరించడానికి నిర్వహించనున్న ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు పోషక విలువలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, సరి అయిన పోషక ఆహారం తీసుకోకపోవడం వల్ల పిల్లలు అనేక వ్యాధుల బారిన పడుతుండగా గర్భిణీ స్త్రీలు బాలింతలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నేటి రోజుల్లో తినే తిండి త్రాగే మంచి నీటిలో సరియైన పోషకాలు ఉండడం లేదని, జంక్ ఫుడ్ బయట పదార్థాలను విచ్చలవిడిగా తీసుకోవడం వలన ప్రాణాంతక వ్యాధులు సోకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ఐసిడిఎస్ ద్వారా నాణ్యమైన పోషక విలువలు కలిగిన పదార్థాలను అందించడానికి చర్యలు తీసుకుందని, అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం ద్వారా ఇప్పటికే అవగాహన నిర్వహించడం జరిగిందని వివరించారు. ప్రతి ఒక్కరు ఆహార పదార్థాలు తీసుకుంటున్న సందర్భంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, శుభ్రమైన నీటిని సేవించాలని సీతక్క సూచించారు. కార్యక్రమంలో ఐ సి డి ఎస్ జిల్లా అధికారి ప్రేమలత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎయిర్ పోర్ట్ లో భారీగా బంగారం పట్టివేత.

**ముంబై :** ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. రూ.38 కోట్లు విలువచేసే 30 కేజీల బంగారం సీజ్ చేశారు. కెన్యా నుండి ముంబై వచ్చిన లేడీ స్మగ్లర్స్ వద్ద బంగారం గుర్తించిన డీఆర్ఐ అధికారులు. కస్టమ్స్ అధికారులకు ఏమాత్రం అనుమానం రాకుండా బంగారాన్ని స్మగ్లింగ్ చేయడానికి యత్నించారు విదేశీ మహిళలు. విశ్వసనీయ సమాచారం మేరకు ముంబై ఎయిర్‌పోర్ట్లో డి ఆర్ ఐ బృందం మాటు వేసింది. కెన్యా నుండి తీసుకొచ్చిన బంగారంతో ముంబై ఎయిర్‌పోర్ట్లో దిగారు 24 మంది మహిళ స్మగ్లర్స్ బృందం. లేడీ కిలాడీలు అక్రమ బంగారంతో బయటికి వెళ్లే ప్రయత్నం చేశారు. అధికారులను బురిడీ కొట్టించడానికి బుర్కా ధరించి బంగారాన్ని బయటకి తరలించే సకల ప్రయత్నం చేశారు. ఎయిర్‌పోర్ట్లో అధికారుల తనిఖీలను పసిగట్టి వారి వద్ద ఉన్న బంగారం బ్యాగ్ లను కిలాడీలు పడేశారు. ముంబై ఎయిర్‌పోర్ట్ లో రెండు గంటలపాటు హంగామా చేశారు 24 మంది మహిళ స్మగ్లర్స్ ముఠా. అధికారులని ముప్పతిప్పలు పెట్టిన లేడీ కిలాడీలు. లేడీ కిలాడి స్మగ్లర్స్ ముఠా ప్రయత్నాలను తిప్పి కొట్టారు డి ఆర్ ఐ అధికారులు. 24 మంది మహిళా స్మగ్లర్స్ ముఠా అరెస్ట్ చేసి వారి వద్ద 30 కేజీల బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముంబై డిఆర్ఐ అధికారులు తెలిపారు.

# రేషన్ పంపిణీలో 'సర్వర్' పరేషాన్




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ నెలలో మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో రేషన్ దుకాణాల వద్ద భారీ రద్దీ నెలకొంది. అయితే, సాంకేతిక సమస్యలు తోడవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

**బయోమెట్రిక్‌తో చిక్కులు..**

ప్రస్తుతం ఉన్న సాఫ్ట్‌వేర్ నిబంధనల ప్రకారం.. మూడు నెలల బియ్యం తీసుకోవాలంటే లబ్ధిదారులు ఈ-పాస్ యంత్రంపై మూడు-సార్లు వేలిముద్ర వేయాల్సి వస్తోంది. ప్రతి నెలకు విడివిడిగా అథెంటికేషన్ చేయాల్సి రావడంతో ఒక్కో కార్డుకు 20 నుండి 30 నిమిషాల సమయం పడుతోంది. ఒకేసారి లక్షలాది మంది బయోమెట్రిక్ వేస్తుండటంతో సర్వర్లపై ఒత్తిడి పెరిగి ప్రక్రియ నెమ్మదించింది. దీంతో వేలిముద్రలు పడక ప్రజలు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోంది.

**మండుతున్న ఎండలతో అవస్థలు**

ఓ వైపు ఎండలు మండుతుండటంతో వృద్ధులు, మహిళలు షాపుల వద్ద తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రద్దీని తగ్గించేందుకు కొన్ని చోట్ల డీలర్లు టోకెన్ సిస్టమ్ ప్రవేశపెట్టినప్పటికీ, అది మరింత గందరగోళానికి దారితీస్తోంది. మరోవైపు, గోదాముల నుంచి వస్తున్న బియ్యం బస్తాల్లో తూకం తక్కువగా ఉంటోందని డీలర్లు ఆరోపిస్తున్నారు. 50 కేజీల బస్తాలో 4 కేజీల వరకు తక్కువగా వస్తోందని, దీంతో తాము నష్టపోతున్నామని డీలర్ల సంఘం నేతలు పేర్కొంటున్నారు.

సాంకేతిక సమస్యల వల్ల పంపిణీ ఆలస్యమవుతున్నందున, ఈ నెల రేషన్ పంపిణీ గడువును ఏప్రిల్ 30 తర్వాత కూడా పొడిగించాలని కార్డుదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే, మూడు సార్లు థంబ్ వేసే పద్ధతిని మార్చి, ఒకే వేలిముద్రతో 3 నెలల బియ్యం ఇచ్చేలా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయాలని కోరుతున్నారు.

# భారీగా మద్యం, గ్యాస్ సిలిండర్లు సీజ్

**కార్వాన్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోల్కొండ జోన్ పరిధిలోని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున పోలీసులు భారీ స్థాయిలో 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం' నిర్వహించారు. డీసీపీ చంద్ర మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, గ్యాస్ సిలిండర్లు మరియు సరైన పత్రాలు లేని వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ జోన్ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షణలో శనివారం తెల్లవారుజామున 6 గంటల నుండి 8 గంటల వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. జుమ్రాత్ బజార్‌లోని లాలాభవన్ నుండి రాహుల్ ఫుట్‌వేర్ వరకు, కున్నా పాన్ షాప్, లాలా తాలీమ్ నుండి టక్కర్‌వాడి, బుధే బాబా హనుమాన్ దేవాలయం మరియు లోయర్ ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు అణువణువూ గాలించారు. తనిఖీల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నట్లు డీసీపీ తెలిపారు. మద్యం 49.4 లీటర్ల విస్కీ మరియు బీరు సీసాలు. 22 కమర్షియల్, 12 డొమెస్టిక్ మరియు 79 చిన్న గ్యాస్ సిలిండర్లు, సరైన పత్రాలు లేనివి మరియు నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన 28 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జోన్ డీసీపీ జి. చంద్ర మోహన్, అడిషనల్ డీసీపీ బి. కృష్ణ గౌడ్ గోషామహల్ ఏసీపీ ఎస్. సుదర్శన్ కుల్సుంపురా ఏసీపీ వి. తిరుపతి మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రాఘవేంద్ర, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ పి. మహేందర్ గోల్కొండ జోన్ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలు మరియు సి.ఏ.ఆర్. హెడ్ క్వార్టర్స్ సిబ్బంది కలిపి మొత్తం 184 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల భద్రత కోసం మరియు నేరాల నియంత్రణ కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.



# అంబులెన్స్ ను ఢీకొట్టిన బస్సు..

- అంబులెన్స్ ను ఢీకొట్టిన బస్సు
- డ్రైవర్ సహా పేషెంట్ మృతి
- మృతులు ఆదిలాబాద్ కు చెందిన సలేహా భానుగా గుర్తించారు

**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వరం పల్లి వద్ద అంబులెన్స్ ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంబులెన్స్ లో ఉన్న డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పేషెంట్ కూడా మృతి చెందింది. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతులు ఆదిలాబాద్ కు చెందిన సలేహా భానుగా గుర్తించారు. డ్రైవర్ ను గుర్తించాల్సి ఉంది. ఇదే ప్రమాదంలో మృతురాలు భర్త గాయపడగా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పీఏసీఎస్ లకు పాలకవర్గాలు ఎప్పుడో..?




**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) పరిస్థితి సందిగ్ధంగా మారింది. ఈ సంఘాలకు గత ఐదు నెలలుగా పూర్తి స్థాయి పాలకవర్గాలు లేకపోవడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా పాలకవర్గాలు ఎన్నుకున్నారు. అయితే ఆ పాలకవర్గాలకు కూడా గడువు తీరిపోవడంతో పలుమార్లు అప్పటి ప్రభుత్వం పొడగిస్తూ వచ్చింది. ప్రస్తుతం డిసెంబర్ నెల నాటికి ఆ గడువు కూడా ముగిసిపోవడంతో పాలకవర్గాలు రద్దు అయ్యాయి. దీంతో పర్సన్ ఇన్చార్జీలుగా సహకార సంఘాల అధికారులు వ్యవహరిస్తున్నారు. పర్సన్ ఇన్చార్జిలుగా ఐదు నెలలుగా అధికారులే వ్యవహరిస్తుండడంతో ప్రస్తుతం ప్రభుత్వం వీటికి ఎన్నికలు నిర్వహిస్తుందా లేక అధికారులనే పర్సన్ ఇంచార్జి లుగా కొనసాగిస్తుందా అనే సందిగ్ధం ఇటు రైతులతో పాటు అటు అధికారుల్లోనూ నెలకొంది.

**పలుమార్లు పాలకవర్గాల పొడగింపు**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం పలుమార్లు పొడిగిస్తూ వచ్చింది. 2025 డిసెంబర్ 19న మొదటిసారి ఫిబ్రవరి 14 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మళ్లీ రెండోసారి ఆగస్టు 14 వరకు ఆరు నెలల పాటు పొడిగించింది. ఇక్కడి నుంచి డిసెంబర్ 19 వరకు కూడా పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా డిసెంబర్ 19 నుంచి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో పాలకవర్గాల గడువు రద్దయింది.

**ప్రత్యక్ష ఎన్నికలా.. నామినేటెడ్ పదవులా..?**

ఈ నేపథ్యంలో పీఏసీఎస్ లకు ఎన్నికలు నిర్వహిస్తారా లేక నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాలను నియమిస్తారా అనే అంశంపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. దీంతో ఇటు రైతులతో పాటు అటు అధికారుల్లోను సందిగ్ధం నెలకొంది. ఇటీవల సహకార సంఘాలకు ప్రత్యక్ష ఎన్నికలు కాకుండా పరోక్షంగా అంటే నామినేటెడ్ పద్ధతిలో నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. ఐదు నెలలుగా సహకార సంఘాలకు కార్యవర్గాలు లేకపోవడంతో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోననే చర్చ జరుగుతుంది.

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 144 సంఘాలు**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 144 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలున్నాయి. నిజామాబాద్ జిల్లాలో 89 కామారెడ్డి జిల్లాలో 55 సహకార సంఘాలు ఉన్నాయి. అయితే ఉమ్మడి జిల్లాకు కలిపి ఒకటే డిసిసిబి ఉండడంతో దీనికి నిజామాబాద్ జిల్లా కలెక్టర్ చైర్ పర్సన్ గా కొనసాగుతున్నారు. కాగా 144 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పర్సన్ ఇన్చార్జిలుగా సహకార శాఖలోని అధికారులు పర్సన్ ఇన్చార్జిలుగా కొనసాగుతున్నారు.

**రైతులకు ప్రత్యక్ష సేవలు**

రైతులకు వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ప్రత్యక్ష, విస్తృత సేవలు అందుతున్నాయి. రైతులకు వ్యవసాయ పంట రుణాలు ఇవ్వడంతో పాటు ఎరువుల విక్రయం, ధాన్యం కొనుగోళ్లలో కీలక పాత్ర పో షిస్తున్నాయి. డీసీసీబీ నుంచి వ్యవసాయ భూములపై మార్టిగేజ్ రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ, శుపోషణకు కూడా రుణాలు అంది స్తున్నాయి. రైతులకు సబ్సిడీపై ఎరువులు, వివిధ రకాల విత్తనాలు రైతులకు అందజేస్తూ చేదోడు వాదోడుగా నిలుస్తున్నాయి.


**పాలకవర్గాలు ఉంటే మరిన్ని సేవలు**

అయితే పీఏసీఎస్ కార్యదర్శులకు తోడుగా చైర్మెన్లు, డైరెక్టర్ల సేవలు అందితే మరింత మెరుగైన పాలనతో పాటు నాణ్యమైన సేవలు అందుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పాలకవర్గాలు లేకపోవడంతో కార్యదర్శిలు, పర్సన్ ఇన్చార్జిల సేవలు కొనసాగుతున్నాయి.

**ప్రభుత్వ ఆదేశాలతోనే..**

సహకార సంఘాల పాలవర్గాలను రద్దు చేస్తూ ప్రభుత్వం గత యేడాది డిసెంబరులో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశం మేరకు ఆయా సంఘాలకు అధికారులను పర్సన్ ఇన్ చార్జీలుగా నియమించడం జరిగింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

# ఫుట్ పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం



**గండిపేట,ఫ్లాష్ ఇండియా :** రెండో రోజు(శనివారం) నార్సింగి సర్కిల్ అధికారులు ఫుట్ పాత్ ఆక్రమణల పై ఉక్కుపాదం మోపుతున్నారు. ఉదయం నుంచే రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 6 గంటల నుంచే మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగారు. సుమారు 10 కిలోమీటర్ల మేర రోడ్లపై ఫుట్ పాత్ లపై ఉన్న ఆక్రమణలను 16 జేసీబీ యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. గుడిసెలు, జిరాక్స్ సెంటర్లు, ఆక్రమణలకు గురైన బస్సు షెల్టర్లను తొలగిస్తున్నారు. లాంకో హిల్స్ జి సర్కిల్ నుంచి ఓయూ కాలనీ వరకు, ఫ్రెండ్స్ కాలనీ నుంచి నార్సింగి వైపునకు వెళ్లే రహదారిలో అలనాటి హోటల్ వరకు, ప్రేరణ ఆసుపత్రి మీదుగా గౌతమ్ మోడల్ స్కూల్, గోల్డెన్ టెంపుల్ సెక్రటేరియట్ కాలనీ లో ఉన్న ఆక్రమణలు, ప్రతిభ స్కూల్ నుంచి నెక్నం పూర్ చింతచెట్టు సర్కిల్ వరకు, యోగా సర్కిల్ నుంచి అల్కాపూర్ రోడ్ నెంబర్ 30 వరకు రహదారులపై ఉన్న ఆక్రమణలతో పాటు ఫుట్ పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న వీధి వ్యాపారాలను మున్సిపల్ సిబ్బంది జెసిబిలతో తొలగిస్తున్నారు.

మణికొండ ప్రాంతంలో భారీ ఎత్తున ఆక్రమణలు తొలగించడం తీవ్ర చర్చకు దారితీసింది. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్, సీఎంసీ అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు, నార్సింగి డిప్యూటీ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి, ఏసీపీ మనోహర్, డీఈఈ శివ సాయి, 200 మంది సిబ్బంది పాల్గొన్నారు. కొందరు నేతలకు చెందిన ఆక్రమణలు కూడా అధికారులు తొలగించారు. అతి పెద్ద డ్రైవ్ చేపట్టిన అధికారులు ఆక్రమణలు తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు సమిష్టి కృషి





**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** డ్రగ్స్ నిర్మూలనకు సమిష్టి కృషి చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, జగిత్యాల జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు హెల్త్, పోలీస్ శాఖలు సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఎస్పీ అశోక్ కుమార్ శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ యువత దేశానికి అతిపెద్ద సంపద అని, వారు చెడు అలవాట్లకు గురికాకుండా మంచి మార్గంలో నడుచుకుంటూ తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు ప్రత్యేక వార్డుల్లో డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు, ఉచిత చికిత్స, మందులు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ-డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని, ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో డ్రగ్స్ సమస్య పెద్ద సవాలుగా మారిందని, దీన్ని అరికట్టేందుకు ప్రత్యేకంగా 'ఈగల్ టీమ్' ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందం ద్వారా నియంత్రణ, అవగాహన, పర్యవేక్షణ చర్యలు బలోపేతం అవుతున్నాయి. మత్తు పదార్థాల వాడకం ఆరోగ్యం, కుటుంబం, ఆర్థిక సమస్యలు నేరాలకు దారితీస్తుందని, ఇది సామాజిక-ప్రజా ఆరోగ్య సమస్య కాబట్టి అందరూ కలిసి పోరాడాలని సూచించారు. డీ అడిక్షన్ సెంటర్ అనేది వ్యసనానికి గురైన వారికి రెండో అవకాశం అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** సమాజమే ముఖ్యమని సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అనిటీజీఐపీసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు జిల్లాలో శనివారం సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఐపీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, శాసనసభ్యులు చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నటరాజ్ థియేటర్ సమీపంలో నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీజీఐపీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, మహిళా విద్య కోసం చేసిన కృషిచిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కలగాలని ఆశించిన గొప్ప సంఘసంస్కర్తగా ఆయనను కొనియాడారు. మహిళల విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవల వల్లనే నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. యువత ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి, భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, జిల్లాలో డిగ్రీ, జూనియర్ కళాశాలల బాలికలకు హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని అన్నారు. మహిళా విద్యకు పునాది వేసిన సావిత్రిబాయి పూలే సేవలను గుర్తుచేశారు. పూలే దంపతుల స్ఫూర్తితో యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జిల్లాలో బీసీ వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం సి.ఎస్.ఆర్ నిధుల కింద రూ.35 లక్షలతో ట్రంక్ బాక్సులు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రూ.1.52 కోట్ల వ్యయంతో హాస్టల్ భవనాల మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. ఎస్ఎస్ సీ విద్యార్థులకు ఆల్-ఇన్-వన్ గైడ్స్ అందజేసినట్లు, గత సంవత్సరం పదవ తరగతిలో 99.5 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ సంవత్సరం 100 శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా గ్రూప్స్, యూపీఎస్సీ పరీక్షలకు కోచింగ్‌తో పాటు అవసరమైన మెటీరియల్ అందించామని కలెక్టర్ తెలిపారు. బీసీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, జిల్లా సాంస్కృతిక సారథి కళాకారుల పాటలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు

# ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు



**దోమ,ఫ్లాష్ ఇండియా :** ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేందుకు తెలంగాణ పోలీసులు "ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు" విధానాన్ని అమలు చేస్తున్నట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ఈ విధానం ద్వారా బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే పోలీసులు బాధితుల ఇంటికి లేదా వారికి అనుకూలమైన ప్రదేశానికి చేరుకుని ఫిర్యాదును స్వీకరిస్తారు. ఫిర్యాదు రాయలేని పరిస్థితుల్లో బాధితుడి వాంగ్మూలాన్ని నమోదు చేసి, చదివి వినిపించి సంతకం తీసుకుని అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసి ప్రతిని అందజేస్తారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, బలహీన వర్గాల వారికి ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. లైంగిక నేరాలు, హత్యాయత్నం, గాయపరిచే ఘటనలు, దొంగతనం, దోపిడీ, చోరీ వంటి ఆస్తి సంబంధిత నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహ నిరోధక చట్టాలకు సంబంధించిన కేసుల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. మహిళలు, పిల్లలకు సంబంధించిన కేసుల్లో మహిళా పోలీసు అధికారిని తప్పనిసరిగా పంపిస్తారు. అవసరమైతే ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయుల సమక్షంలో వాంగ్మూలం నమోదు చేస్తారు. సంఘటన స్థలాన్ని రక్షిస్తూ సాక్ష్యాలను సేకరించే చర్యలను పోలీసులు వెంటనే ప్రారంభిస్తారు. ఈ విధానం ద్వారా ఫిర్యాదు నమోదు ప్రక్రియ వేగవంతమవుతుందని, బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ఇబ్బందులు తగ్గుతాయని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు.

# తమకు హామీలు నెరవేర్చకుండానే పనులు ఎలా..?



**ములుగు,ఫ్లాష్ ఇండియా :** మార్కెట్ యార్డ్ నిర్మాణానికి సంబంధించిన భూమి చదును పనులను రైతులు అడ్డుకుని, తమకు హామీ ఇచ్చిన ప్లాట్లు కేటాయించిన తరువాతే పనులు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా వంటిమామిడి కూరగాయల మార్కెట్ కు ఎదురుగా ఉన్న స్థలానికి మార్పిడి చేయడానికి అధికారులు భూమి చదును పనులు చేపట్టగా.. రైతులు ఆందోళనకు దిగిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ములుగు మండలంలోని వంటి మామిడి మార్కెట్ యార్డ్‌కు ఎదురుగా ఉన్న భూమిలో పనులు ప్రారంభించడంపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు రైతుల నుంచి సుమారు 82 ఎకరాల భూమిని సేకరించి, ఎకరాకు రూ.8.50 లక్షల చొప్పున పరిహారం చెక్కుల రూపంలో చెల్లించారు. అదనంగా మార్కెట్ అనుకోని ఉన్న 20 ఎకరాల భూమిలో ప్లాట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అవి ఇప్పటివరకు అమలు కాలేదని రైతులు తెలిపారు. ఆ 20 ఎకరాల భూమిలో కూడా ప్లాట్లు చేయలేదని రైతులు తమ గ్రామంలోని ఇళ్లకు సమీపంలో ప్రభుత్వ భూమిని కేటాయించాలన్నారు. మా ఇళ్ల స్థలాలకు ప్లాట్లు చూపించిన అనంతరం పనులు ప్రారంభించాలని వ్యతిరేకిస్తూ రైతులు రాజీవ్ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, ములుగు తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎస్సై రఘుపతి ఘటనాస్థలానికి చేరుకుని రైతులతో చర్చించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారం రోజుల్లో పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన కూడా రైతులు ఆందోళన కు విరమించకపోవడం తొ రైతులను పోలీస్ లు స్టేషన్ కు తరలించారు. ప్రభుత్వ హామీ ప్రకారం.. భూమి కోల్పోయిన ప్రతి రైతుకు 250 గజాలు ఇంటి స్థలాన్ని కేటాయించిన తరువాతనే ప్రభుత్వం మార్కెట్ పనులు చేపట్టాలని లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు

# యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలి




**మెదక్,ఫ్లాష్ ఇండియా :** మత్తు పదార్థాలకు యువతను దూరంగా ఉంచాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. శనివారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీతా దేవి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్, డీసీహెచ్ డా. శివదయాలతో కలిసి మత్తు పదార్థాల చికిత్స కేంద్రాన్ని ప్రారంభించారు. మత్తుపదార్థాల చికిత్స కేంద్రం పని విధానాన్ని, ల్యాబ్ లను, కౌన్సిలింగ్ ప్రదేశాన్ని, చికిత్స విధానాన్ని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలని, చెడు వ్యసనాలు అలవాటు పడిన వారిని తక్షణమే చికిత్స అందించి, సాధారణ వ్యక్తులుగా తీర్చిదిద్దాలని వైద్యులకు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాలు బానిసైతే జీవితాలు చీకటి మార్గం వైపు పయనిస్తాయని, అలాంటి చెడు దారిని ఎన్నుకోకుండా యువత సన్మార్గం వైపు ప్రయాణించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నియంత్రణపై వైద్య విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రం, షీల్డ్ ను బహుకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ మహేష్, వైద్యాధికారులు , వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు

# ఇంటర్ విద్యార్థులు ఫలితాలు చూసి ఒత్తిడి కి గురి కావద్దు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** నేటి ఇంటర్మీడియట్ ఫలితాలను చూసి విద్యార్థినీ విద్యార్థులకు ఎవరు కూడా ఒత్తిడికి, అసంతృప్తికి, భయాందోళనలకు గురికావద్దని ఆచార్య ఐఐటి అకాడమీ వ్యవస్థాపకులు మాథ్స్ వినోబారెడ్డి అన్నారు. సప్లమెంటరీ వారిని కూడా షార్ట్ టర్మ్ కోచింగ్ ద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని, తక్కువ మార్కులు వచ్చిన వారిని ఎక్కువ మార్కులు వచ్చే విధంగా తయారుచేసి ,ఎంతో మంది విద్యార్థులను జీరో టు హీరోలుగా మార్చే బాధ్యతను ఆచార్య ఐఐటీ అకాడమీ తీసుకుంటుందని వ్యవస్థాపకులు మ్యాథ్స్ వినోబారెడ్డి తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని 9848418201 కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



# మేము బాధపడటం లేదు

రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రతి మ్యాచ్‌లోనూ బౌలర్లపై విరుచుకుపడుతున్నాడు. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో రెచ్చిపోయాడు. వైభవ్ కేవలం 26 బంతుల్లోనే 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 78 పరుగులు చేసి 300 స్ట్రైక్ రేట్‌తో ఆర్సీబీ బౌలింగ్ విభాగాన్ని చిన్నాభిన్నం చేశాడు. 15 ఏళ్ల కుర్రాడు ఆడిన ఇన్నింగ్స్ చూసి అనుభవజ్ఞులైన బౌలర్లు షాక్ అవుతున్నారు. ఇక స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను సైతం వైభవ్ విడిచిపెట్టలేదు. ఈ విధ్వంసరకర బ్యాట్స్‌మెన్ గురించి మ్యాచ్ అనంతరం భువనేశ్వర్ మాట్లాడాడు. టీ20లో వయసుతో సంబంధం లేదని భువీ అన్నాడు. ఇలాంటి ఇన్నింగ్స్ సహజమే అని చెప్పుకొచ్చాడు. ఈ కుర్రాడు చాలా బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడని తెలిపాడు. తన బౌలింగ్‌లో ఓ 15 ఏళ్ల కుర్రాడు కొట్టాడని తాము బాధపడటం లేదన్నాడు.తాము వేసిన ప్లాన్స్‌ను సరిగ్గా అమలు చేయలేకపోయామని భువీ ఒప్పుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఒక క్యాచ్ మిస్ అయ్యిందని గుర్తు చేశాడు. ఇక ఈ 15 ఏళ్ల కుర్రాడికి క్రెడిట్ ఇవ్వాల్సిందే అంటూ కొనియాడాడు. ఆర్సీబీ బౌలింగ్ వ్యూహాల గురించి వివరణ ఇచ్చాడు. పవర్‌ప్లేలో స్పిన్నర్లను వాడటం కష్టమని, ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ వల్ల సుయాష్‌ను తీసుకోలేకపోయామని చెప్పాడు. కేవలం ఒక లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మాత్రమే ఉండటంతో వైభవ్‌ను కట్టడి చేయడం సాధ్యం కాలేదని భువీ అంగీకరించాడు. వైభవ్ బ్యాటింగ్ శైలి గురించి భువీ మాట్లాడుతూ.. "అతను కేవలం బంతిని బలంగా బాదడమే కాకుండా, సరైన క్రికెటింగ్ షాట్లతో అలరించాడు. ఆ వయసులో అంత మెచ్యూరిటీ ఉండటం గొప్ప విషయం" అని కొనియాడాడు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. నిన్న(శుక్రవారం) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ ఎంతో ఉత్కంఠ భరితంగా సాగింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ పోరులో టాస్ గెలిచిన రాజస్థాన్ జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో యువ బ్యాట్స్‌మెన్ వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. గౌహతిలోని బర్సపారా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో వైభవ్ 26 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 78 పరుగులు చేశాడు. కేవలం 15 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు.. ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ (40 బంతుల్లో 63 పరుగులు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి జట్టుకు 201 పరుగుల భారీ స్కోరును అందించాడు. విరాట్ కోహ్లీ (32), రోమారియో షెపర్డ్ (22), వెంకటేష్ అయ్యర్ (29) కూడా తమ వంతు సహకారం అందించారు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, రవి బిష్ణోయ్, బ్రిజేష్ శర్మలు తలో రెండు వికెట్లు తీసి ఆర్సీబీ బ్యాటర్లను కట్టడి చేసే ప్రయత్నం చేశారు. నిర్ణీత 20 ఓవర్లలో బెంగళూరు 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. వైభవ్ మెరుపు ఇన్నింగ్స్ ఆధారంగా, రాజస్థాన్ ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# గెలుపు సీక్రెట్ బయటపెట్టిన వైభవ్



వైభవ్ సూర్యవంశీ ఈ పేరు క్రికెట్ హిస్టరీలో ఓ ప్రత్యేకతను సంతరించుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తన బ్యాటింగ్ తో క్రికెట్ దిగ్గజాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాడు. మంచి నీళ్లు తాగినంత ఈజీగా పరుగులు సాధిస్తున్నాడు. బంతి పడడమే ఆలస్యం బౌండరీగానో, సిక్సర్ గానో మలుస్తున్నాడు. క్రీజులో ఉన్నంతసేపు దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ పరుగుల వరద పారిస్తున్నాడు. దిగ్గజ బౌలర్లకు సైతం వణుకుపుట్టిస్తున్నాడు. నిన్న ఆర్సీబీతో జరిగిన మ్యాచ్ లో వైభవ్ కేవలం 26 బంతుల్లోనే 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 78 పరుగులు చేసి రాజస్థాన్ విజయంలో కీలకరోల్ ప్లే చేశాడు.ఈ యువ రాజస్థాన్ రాయల్స్ బ్యాట్స్‌మన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై 26 బంతుల్లో 78 పరుగులు చేసి, తన జట్టు రెండు ఓవర్లు మిగిలి ఉండగానే 201 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో సహాయపడ్డాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి ఇన్నింగ్స్‌లో 201/8 స్కోరు చేసింది. మ్యాచ్ అనంతరం, సూర్యవంశీ తన విజయ రహస్యాన్ని వెల్లడిస్తూ, తాను బౌలర్ పేరుతో ప్రభావితం కానని పేర్కొన్నాడు. 'నేను బంతిని చూస్తాను.. బౌలర్‌ను కాదు' అని తెలిపాడు. జస్ప్రీత్ బుమ్రా లేదా జోష్ హేజిల్‌వుడ్ వంటి బౌలర్‌ను ఎదుర్కోవాలనే ఆలోచన తన మనసులో ఉన్నప్పటికీ, తాను కేవలం బంతిపైనే దృష్టి పెడతానని చెప్పాడు.ఈ మ్యాచ్‌లో సూర్యవంశీ ప్రత్యేకంగా హేజిల్‌వుడ్‌ను లక్ష్యంగా చేసుకుని, వరుసగా నాలుగు బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్సర్ కొట్టి మ్యాచ్ స్థితిని మార్చేశాడు. ఇంత చిన్న వయసులోనే ఇంతటి విజయం సాధించినప్పటికీ, సూర్యవంశీ ఒదిగి ఉంటాడు. తన తండ్రి సంజీవ్, జట్టు సహాయక సిబ్బంది సభ్యుడు రోమీ భిందర్ నిరంతరం తనకు సరైన మార్గంలో మార్గనిర్దేశం చేస్తారని చెప్పాడు. క్రికెట్ ఒక సుదీర్ఘ ప్రయాణమని, దృష్టి అంతా ఆటపైనే ఉండాలని వారిద్దరూ అతనికి గుర్తుచేస్తుంటారు.అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడినప్పటికీ, సూర్యవంశీ పూర్తిగా సంతృప్తిగా కనిపించలేదు. 78 పరుగుల వద్ద ఔటవ్వడం నిరాశ కలిగించిందని తెలిపాడు. తాను చివరి వరకు క్రీజులో ఉండి ఉంటే, జట్టుకు మరో 20 పరుగులు జోడించి ఉండేవాడినని తెలిపాడు.

# పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో గమ్మత్తు ఉదంతం..



పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లు ఐపీఎల్‌ను చూసి పాకిస్థాన్ సూపర్ లీగ్ ప్రారంభించింది. ఇక ఈ ఏడాది సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వివాదాలు చుట్టుముడుతున్నాయి. బాల్ ట్యాంపరింగ్, బాల్ గులాబీ రంగులోకి మారడం, అంపైర్ల నిర్ణయాలు ఇలా ఎక్కడ చూసిన వివాదాలే కనిపిస్తున్నాయి. తాజాగా మరో వివాదం చర్చనీయాంశమైంది. తాజాగా క్వెట్టా గ్లాడియేటర్స్, రావల్పిండి జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. క్వెట్టా బౌలర్ ఉస్మాన్ తారిఖ్ బౌలింగ్ యాక్షన్ న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్‌ను తీవ్ర అసహనానికి గురిచేసింది. తారిఖ్ బంతిని విసిరే ముందు ఆగి రావడంపై మిచెల్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఏకంగా రెండుసార్లు క్రీజులో నుంచి పక్కకు తప్పుకున్నాడు. ఇలాంటి బౌలింగ్‌లో తాను అడనని సంకేతాలు ఇచ్చాడు. బాల్ విసిరేటప్పుడు వింతగా ఆగుతూ బంతిని వేయడం వల్ల తన ఏకాగ్రత దెబ్బతింటోందని మిచెల్ చెప్పాడు. ఈ ఆసక్తికర సన్నివేశం మ్యాచ్ 9వ ఓవర్లో చోటుచేసుకుంది. ఈ ఓవర్‌లో మిచెల్ పక్కకు తప్పుకోగా, అంపైర్లు జోక్యం చేసుకుని ఆటను కొనసాగించాల్సిందిగా సూచించారు. అయితే నాలుగో బంతికి ముందు కూడా అదే రిపీట్ కావడంతో అంపైర్లు మిచెల్‌తో చర్చలు జరిపారు.ఇదిలా ఉండగా.. ఉస్మాన్ తారీక్ వివాదాస్పద బౌలర్ అన్న విషయం తెలిసిందే. టీ20 వరల్డ్ కప్ సమయంలోనే తారిఖ్ యాక్షన్‌పై చర్చ నడిచింది. బంతిని విసిరే ముందు అతను ఆగి, బ్యాటర్ కదలికలను గమనించి, కౌంటర్ డెలివరీ ఇవ్వడం వల్ల బ్యాటర్లకు టైమింగ్ కష్టమవుతుంది.

ఈ యాక్షన్‌ను 'త్రోయింగ్' అని కొందరు విమర్శిస్తుండగా, ఐసీసీ నిబంధనల ప్రకారమే ఉందని మరికొందరు భావిస్తున్నారు. యూఎస్‌ఏతో జరిగిన మ్యాచ్‌లో ఈ యాక్షన్‌పై ప్రేక్షకులు ట్రోల్ చేశారు, ఇర్ఫాన్ పఠాన్ వంటి మాజీ క్రికెటర్లు దీనిపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ వింత యాక్షన్‌తో జింబాబ్వేపై హ్యాట్రిక్, అలాగే కమెరూన్ గ్రీన్ (ఆస్ట్రేలియా) వికెట్ తీశాడు.

# ఐపీఎల్ లో డబుల్ ధమాకా




ఐపీఎల్ 2026 సీజన్ లో నేడు డబుల్ ధమాకా మ్యాచ్‌లతో క్రికెట్ అభిమానులు పండగ చేసుకోనున్నారు. వారాంతం కావడంతో ఒకే రోజు రెండు కీలకమైన మ్యాచ్‌లు జరగనుండటంతో ఇటు స్టేడియంలలో అటు టీవీల ముందు ప్రేక్షకులకు క్రికెట్ ఫీవర్ తీసుకురానుంది. పాయింట్ల పట్టికలో తమ స్థానాలను పదిలం చేసుకోవడానికి అన్ని జట్లు ఈ రోజు హోరాహోరీగా తలపడనున్నాయి. ముఖ్యంగా సొంత మైదానంలో ఆడుతున్న పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు ఈ రోజు విజయం సాధించి తమ అభిమానులను అలరించాలని ఉవ్విళ్లూరుతున్నాయి.


**మొదటి మ్యాచ్.. PBKS vs SRH**

మొదటి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు, సన్‌రైజర్స్ హైదరాబాద్ పోరు ముల్లాన్‌పూర్ లోని 'మహారాజా యాదవీంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం'లో జరగనుంది. ముల్లాన్‌పూర్ పిచ్ సాధారణంగా బ్యాటర్లకు అనుకూలిస్తుంది, కాబట్టి ఈ మ్యాచ్‌లో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. పంజాబ్ జట్టు తమ సొంత ప్రేక్షకుల మధ్య రెచ్చిపోయి ఆడుతుందా లేక హైదరాబాద్ జట్టు తమ పటిష్టమైన బ్యాటింగ్ లైనప్‌తో పంజాబ్ బౌలర్లను చిత్తు చేస్తుందా అనేది వేచి చూడాలి. ఈ మ్యాచ్‌లో టాస్ కీలక పాత్ర పోషించనుంది, ఎందుకంటే మధ్యాహ్నం ఎండ వేడికి పిచ్ స్వభావం మారే అవకాశం ఉంది.

**రెండో మ్యాచ్.. CSK vs DC**

రెండవ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌తో చెపాక్ స్టేడియంలో తలపడనుంది. సొంత మైదానంలో చెన్నైను ఓడించడం ఏ జట్టుకైనా కష్టమైన పని, కానీ ఢిల్లీ జట్టులో ఉన్న యువ బ్యాటర్లు ఎలాంటి సవాలు విసురుతారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాత్రిపూట జరగనున్న ఈ మ్యాచ్‌లో సెకండ్ ఇన్నింగ్స్ లో బ్యాటింగ్ చేసే జట్టుకు అదనపు బలాన్ని ఇవ్వవచ్చు. మొత్తంగా చూస్తే ఈ శనివారం క్రికెట్ మైదానంలో పరుగుల వర్షం కురవడం ఖాయంగా కనిపిస్తోంది. పంజాబ్, చెన్నై జట్లు తమ సొంత మైదానాల్లో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తాయా? లేదా ప్రత్యర్థి జట్లు గట్టి పోటీ ఇస్తాయా అనేది నేటి సాయంత్రానికి తేలనుంది.

## బిజినెస్




# పెరుగుతున్న మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్స్..

మార్చి 2026 నెలలో భారతదేశ మ్యూచువల్ ఫండ్ రంగం కొత్త రికార్డులను సృష్టించింది. సామాన్యులు నెలల వారీగా పెట్టుబడి పెట్టే SIP ఇన్ ఫ్లో మొదటిసారిగా రూ. 32,087 కోట్లకు చేరింది. ఫిబ్రవరితో పోలిస్తే ఇది 8 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే సిప్ పెట్టుబడులు ఏకంగా 24 శాతం పెరగడం గమనార్హం. ప్రస్తుతం దేశంలో దాదాపు 9.72 కోట్ల సిప్ ఖాతాలు ఉన్నాయి. ప్రజలు క్రమశిక్షణతో కూడిన పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారని ఇది స్పష్టం చేస్తోంది. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోని మొత్తం ఆస్తుల విలువ రూ. 73.73 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో కేవలం సిప్ ద్వారా వచ్చిన ఆస్తులే రూ. 15.10 లక్షల కోట్లు (సుమారు 20.5 శాతం) ఉండటం విశేషం.మ్యూచువల్ ఫండ్ ఖాతాల సంఖ్య మార్చి నాటికి 27.39 కోట్లకు చేరింది. కేవలం ఒక్క నెలలోనే 33.63 లక్షల కొత్త ఖాతాలు ప్రారంభమయ్యాయి. ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు రావడం ఇది వరుసగా 61వ నెల. దీర్ఘకాలికంగా సంపదను సృష్టించుకోవడానికి భారతీయులు మ్యూచువల్ ఫండ్లను నమ్ముతున్నారని దీనిని బట్టి అర్థమవుతోంది.సిప్ పెట్టుబడులు బలంగా ఉన్నప్పటికీ.. ఫిబ్రవరితో పోలిస్తే ఆస్తుల విలువ కొంత తగ్గింది. అయితే.. రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటం, ప్రజలు తమ ఆర్థిక లక్ష్యాల కోసం మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవడం వల్ల ఈ వృద్ధి సాధ్యమైందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.




# సీఈవోపై ఉద్యోగుల సంచలన ఆరోపణలు..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిన OpenAI ఇటీవల వివాదంలో నిలిచింది. ఈ సంస్థ సీఈవో సామ్ ఆల్ట్‌మన్‌పై సంస్థలోనే పనిచేసే కొంతమంది ఉద్యోగులు సంచలన ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా, ఆయనకు మెషిన్ లెర్నింగ్ మరియు కోడింగ్‌పై తగిన అవగాహన లేదని ఆరోపించడం గమనార్హం.

**సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేదనే ఆరోపణలు:** ఒక ప్రముఖ పత్రికలో ప్రచురితమైన నివేదిక ప్రకారం, ఆల్ట్‌మన్‌తో కలిసి పనిచేసిన కొందరు ఉద్యోగులు ఆయన సాంకేతికంగా బలహీనుడని పేర్కొన్నారు. మెషిన్ లెర్నింగ్ వంటి కీలక అంశాలపై లోతైన అవగాహన లేకపోవడంతో పాటు, ప్రాథమిక సాంకేతిక పదాలను కూడా తప్పుగా ఉపయోగిస్తారని ఆరోపించారు. దీనివల్ల టీమ్‌లో కొంత గందరగోళం ఏర్పడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

**ఇంజనీర్ల అసంతృప్తి:** కంపెనీలో పనిచేసే కొంతమంది ఇంజనీర్లు కూడా ఆల్ట్‌మన్‌పై విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా సాంకేతిక విషయాల్లో ఆయన స్పష్టత లేకపోవడం వల్ల నిర్ణయాలు తీసుకోవడంలో సమస్యలు తలెత్తుతున్నాయని వారు అంటున్నారు. అయితే, ఈ ఆరోపణలపై సంస్థ అధికారికంగా పెద్దగా స్పందించలేదు.


**వ్యాపార దృష్టికోణమే బలం:** ఆల్ట్‌మన్‌ను విమర్శించిన వారే ఆయనకు ఉన్న మరో ముఖ్యమైన బలం గురించి కూడా పేర్కొన్నారు. సాంకేతిక నైపుణ్యం కంటే వ్యాపార దృష్టికోణం, నాయకత్వ లక్షణాలు ఆయనను ఈ స్థాయికి తీసుకువచ్చాయని తెలిపారు. వ్యక్తులను ఒప్పించడంలో ఆయనకు ఉన్న నైపుణ్యం కారణంగా, పెద్ద నిర్ణయాలను కూడా సులభంగా అమలు చేయగలుగుతున్నారని అన్నారు.

**విద్యను మధ్యలోనే వదిలిన ఆల్ట్‌మన్:** Stanford Universityలో కంప్యూటర్ సైన్స్ చదువు ప్రారంభించిన ఆల్ట్‌మన్, 2005లోనే చదువును మధ్యలో వదిలేశారు. అనంతరం వ్యాపార రంగంలో అడుగుపెట్టి, టెక్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించారు.

**ప్రజలను ప్రభావితం చేసే నైపుణ్యం:** మాజీ పరిశోధకులు మరియు సహచరుల ప్రకారం, ఆల్ట్‌మన్ ప్రజలను ప్రభావితం చేయడంలో ఎంతో నైపుణ్యం కలిగిన వ్యక్తి. తన ఆలోచనలను ఇతరులకు నమ్మించే సామర్థ్యం ఆయన విజయానికి ముఖ్య కారణమని చెబుతున్నారు.

**2023 ఘటనపై మళ్లీ చర్చ:** 2023లో ఆల్ట్‌మన్‌ను సీఈవో పదవి నుంచి తాత్కాలికంగా తొలగించిన ఘటనను కూడా ఈ సందర్భంలో గుర్తుచేస్తున్నారు. ఆ సమయంలో బోర్డు సభ్యులకు ఆయనపై నమ్మకం తగ్గిందనే వార్తలు వెలువడ్డాయి. అయితే, తరువాత ఆయన మళ్లీ తన పదవిలోకి వచ్చారు.మొత్తంగా సామ్ ఆల్ట్‌మన్‌పై వచ్చిన ఈ ఆరోపణలు టెక్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారాయి. సాంకేతిక నైపుణ్యం కంటే నాయకత్వం, వ్యాపార దృష్టికోణం ముఖ్యమా అనే ప్రశ్నను ఇవి మళ్లీ లేవనెత్తుతున్నాయి. అయితే, ఈ ఆరోపణలపై స్పష్టమైన నిర్ధారణ లేకపోవడంతో, ఇవి ఎంతవరకు నిజమో అనేది ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది.

# బంగారం ధర జోరు..



పశ్చిమాసియా యుద్ధం ప్రారంభం అయిన దగ్గర నుంచి బంగారం, వెండి ధరలు హెచ్చుతగ్గులు అవుతున్నాయి. ఒకరోజు పెరుగుతుంటే.. ఇంకో రోజు దిగొస్తున్నాయి. దీంతో సమాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఈరోజు తులం గోల్డ్‌పై రూ.490 పెరగగా.. వెండి ధర మాత్రం ఉపశమనం కలిగిస్తోంతది.తులం గోల్డ్‌పై రూ.490 పెరగడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,52,840 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.450 పెరగడంతో రూ.1,40,100 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.370 పెరగడంతో రూ.1,14,630 దగ్గర ట్రేడ్ అవుతోంది.హమ్మయ్య.. సిల్వర్ ధర ఉపశమనం కలిగించింది. ఈరోజు వెండి ధర యధాతథంగా ఉంది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,60, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.2,65,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, బెంగళూరులో మాత్రం కిలో వెండి ధర రూ.2,60, 000 దగ్గర అమ్ముడవుతోంది.

# తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు




గ్యాస్ సిలిండర్ ధరలు ప్రతి నెల ఒకటో తేదీన సవరిస్తుంటారు. అయితే, ఇటీవల చోటుచేసుకున్న అంతర్జాతీయ ఉద్రిక్తతల(ఇరాన్-ఇజ్రాయెల్ వివాదం) కారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయ వంట గ్యాస్(LPG) సిలిండర్ ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఈ పెంపుతో హైదరాబాద్‌లో 14.2 కిలోల సిలిండర్ ధర రూ.965.00కు చేరుకుంది. ఈ క్రమంలో ఇటీవల పెరిగిన ధరలు ఏప్రిల్ 1వ తేదీ నుంచైన తగ్గుతాయెమో అని వినియోగదారులు ఆశపడ్డారు. కానీ వారికి నిరాశే మిగిలింది. ఈ నెల ఒకటో తేదీన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల్ని పెంచగా.. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలు స్థిరంగా ఉన్నాయి.

**ఏప్రిల్ 11వ తేదీన గ్యాస్ సిలిండర్ ధరలు**

హైదరాబాద్: రూ.965.00
వరంగల్: రూ.984.00
విశాఖపట్నం: రూ.921.00
విజయవాడ: రూ.937.50
గుంటూరు: రూ.937.50

# లెజెండరీ నటి బయోపిక్‌లో ఛాన్స్!




భారతీయ వెండితెర దిగ్గజం మధుబాల జీవిత చరిత్ర త్వరలో వెండితెరపై ఆవిష్కృతం కాబోతోంది. ఈ ప్రతిష్టాత్మక బయోపిక్‌లో మధుబాల పాత్రను పోషించే అరుదైన అవకాశాన్ని యువ నటి సారా అర్జున్ దక్కించుకుంది. ఇటీవల వచ్చిన 'ధురంధర్' సిరీస్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సారా.. ఇప్పుడు ఈ ఐకానిక్ పాత్రతో తన కెరీర్‌లో మరో మెట్టు ఎక్కబోతోంది. ఈ చిత్రాన్ని బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ నిర్మిస్తుండటం విశేషం. 'డార్లింగ్స్' సినిమాతో తన ప్రతిభను చాటుకున్న జస్మీత్ కె. రీన్ ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహించనున్నారు. భన్సాలీ చిత్రాలంటేనే ఉండే ఆ లార్జర్ ద్యాన్ లైఫ్ మేకింగ్ ఈ సినిమాపై అంచనాలను పెంచేస్తోంది.సారా అర్జున్ ప్రయాణం అత్యంత స్ఫూర్తిదాయకం. చిన్న వయసులోనే టీవీ ప్రకటనలతో కెరీర్ ప్రారంభించిన సారా.. ఆరేళ్ల వయసులో చియాన్ విక్రమ్ సరసన 'నాన్న' చిత్రంలో బాలనటిగా నటించి అందరి హృదయాలను గెలుచుకుంది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన ఆమె.. ఇటీవల హీరోయిన్‌గా 'ధురంధర్' సినిమాతో సంచలన విజయాన్ని అందుకుంది.

మధుబాల బయోపిక్ కోసం తొలుత పరిశ్రమలోని పలువురు స్టార్ హీరోయిన్ల పేర్లను చిత్ర బృందం పరిశీలించింది. అయితే మధుబాలలోని ఆ అమాయకత్వం, తీక్షణతను ప్రతిబింబించడంలో సారా అయితేనే పూర్తి న్యాయం చేయగలదని నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ భావించారని తెలుస్తోంది. సారా స్క్రీన్ ప్రెజెన్స్ ఈ పాత్రకు ప్రధాన బలం కానుంది.ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అంతా అనుకున్నట్లు జరిగితే.. ఈ ఏడాది చివరలో సినిమా షూటింగ్ పట్టాలెక్కనుంది. 'ధురంధర్'లో తన నటనతో మెప్పించిన సారా అర్జున్.. ఇప్పుడు లెజెండరీ నటి మధుబాలగా ఎలా మెప్పిస్తుందో చూడాలని అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడనుంది.

# రవిబాబు 'రేజర్' రిలీజ్ డేట్ ఖరారు!




టాలీవుడ్ వెర్సటైల్ డైరెక్టర్ రవిబాబు మళ్ళీ తన ఫేవరెట్ జోనర్‌లోకి అడుగుపెట్టారు. అల్లరి, అనసూయ, అవును వంటి వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన ఆయన, ఇప్పుడు 'రేజర్' అనే పవర్‌ఫుల్ క్రైమ్ థ్రిల్లర్‌తో రాబోతున్నారు. ఫ్లయింగ్ ఫ్రాగ్స్ బ్యానర్‌పై రవిబాబు స్వయంగా నిర్మించిన ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్ సమర్పిస్తోంది. రవిబాబు సినిమాల్లో ఉండే టెక్నికల్ గ్రాండియర్, సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఇందులో పుష్కలంగా ఉండబోతున్నాయని సమాచారం.ప్రస్తుతం థ్రిల్లర్ సినిమాలకు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని, రవిబాబు తన మార్క్ మేకింగ్‌తో బాక్సాఫీస్ వద్ద హిట్ కొట్టడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు.అయితే తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. వేసవి కానుకగా మే 8న ఈ చిత్రం థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ గ్లింప్స్ లోని వైలెన్స్ చూస్తుంటే, రవిబాబు ఈసారి మామూలు సినిమా తీయలేదని అర్థమవుతోంది. మొత్తనికి ఈ సమ్మర్ లో మాస్, క్రైమ్ థ్రిల్లర్ లవర్స్ కి 'రేజర్' ఒక పర్ఫెక్ట్ ఛాయిస్ కానుంది.



# పంతం వీడనుందా?

టాలీవుడ్ జేజమ్మ అనుష్క శెట్టి వెండితెరపై కనిపించి చాలా కాలమే అవుతోంది. 'సైజ్ జీరో' సినిమా కోసం ఆమె పడ్డ కష్టం, ఆ తర్వాత ఎదురైన ఆరోగ్య సమస్యలు ఆమెను కెమెరా ముందుకు రావడానికి ఇబ్బంది పెడుతున్నాయనేది బహిరంగ రహస్యం. గత ఏడాది విడుదలైన 'ఘాటీ' సినిమా ప్రమోషన్లలో కూడా ఆమె కనీసం వీడియో కాల్‌లో కూడా కనిపించకుండా కేవలం వాయిస్ క్లిప్స్‌తో సరిపెట్టడం ఆమె ఫ్యాన్స్‌ను నిరాశపరిచింది. అయితే, ఇప్పుడు వినిపిస్తున్న ఒక రూమర్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.అనుష్క తొలిసారి మలయాళంలో నటించిన పాన్-ఇండియా చిత్రం 'కథనార్: ది వైల్డ్ సోర్సరర్' . జయసూర్య హీరోగా నటిస్తున్న ఈ ఫాంటసీ థ్రిల్లర్ ట్రైలర్ ఇటీవలే విడుదలై విజువల్స్ పరంగా వావ్ అనిపించింది. అయితే ఇందులో అనుష్కను ఒకటి రెండు షాట్స్‌కే పరిమితం చేయడంతో ఆమె రోల్ నిడివిపై సందేహాలు మొదలయ్యాయి. కానీ, చిత్ర బృందం మాత్రం అనుష్క ఈ సినిమా కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లో జరిగే ప్రమోషన్లలో స్వయంగా పాల్గొంటుందని చెబుతోంది.

ఇది ఆమె 50వ సినిమా కావడం, మలయాళంలో డెబ్యూ కావడంతో ఆమె ఈసారి మినహాయింపు ఇస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు.మరోవైపు నెటిజన్లు మాత్రం, "స్ట్రయిట్ సినిమాలు చేసినప్పుడే రాని స్వీటీ, ఒక మలయాళ డబ్బింగ్ సినిమా కోసం వస్తుందా?"

అని పెదవి విరుస్తున్నారు. మరి ఈ ఏడాది జూలై లేదా ఆగస్టులో విడుదల కానున్న ఈ సినిమా కోసం అనుష్క తన ఐదేళ్ల 'ప్రమోషన్ బ్రేక్'ను చెరిపివేసి మీడియా ముందుకు వస్తుందో లేదో వేచి చూడాలి. ఒకవేళ అనుష్క నిజంగానే ప్రమోషన్లలో పాల్గొంటే, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమాకు భారీ ఓపెనింగ్స్ రావడం ఖాయం!

# మళ్ళీ ఊరిస్తున్న 'పెద్ది'..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ దర్శకుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో వస్తున్న 'పెద్ది' చిత్రంపై నెలకొన్న సస్పెన్స్ ఇప్పుడు పీక్స్‌కు చేరుకుంది. తొలుత మార్చిలో రావాల్సిన ఈ చిత్రం, షూటింగ్ ఆలస్యం కావడంతో ఏప్రిల్ 30న విడుదల చేస్తామని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. అయితే ఏప్రిల్ నెలలోకి అడుగుపెట్టి 10 రోజులు గడుస్తున్నా, ప్రమోషన్ల విషయంలో మేకర్స్ సైలెంట్‌గా ఉండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా మళ్ళీ వాయిదా పడటం దాదాపు ఖాయమైపోయింది.అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభించాల్సిన డిస్ట్రిబ్యూటర్లకు, ప్రొడక్షన్ టీం నుండి "బుకింగ్స్ హోల్డ్ లో పెట్టండి" అని సమాచారం అందడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. ఐపీఎల్ ఫీవర్, షూటింగ్ లో ఇంకాస్త ప్యాచ్ వర్క్, ఒక స్పెషల్ సాంగ్ బ్యాలెన్స్ ఉండటంతో 'పెద్ది'ని జూన్ చివరి వారానికి వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై క్లారిటీ రాకపోవడంతో అఖిల్ 'లెనిన్' వంటి ఇతర సినిమాలు కూడా తమ డేట్స్ మార్చుకుంటూ సందిగ్ధంలో పడ్డాయి. మరి ఈ మెగా బాక్సాఫీస్ గర్జన ఎప్పుడు వినిపిస్తుందో తెలియాలంటే మేకర్స్ నుండి వచ్చే అధికారిక ప్రకటన వరకు ఆగాల్సిందే!

# 'ఆదర్శ కుటుంబం'లో 'ధురంధర్ 2' నటుడు




టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్ ప్రస్తుతం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47' అనే సినిమాలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఈ ఏడాది సమ్మర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈ చిత్రం ఈ వేసవిలో విడుదలయ్యే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇదిలా ఉండగా, తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ధురంధర్ 2' చిత్రం ద్వారా మంచి గుర్తింపు సంపాదించుకున్న ఉదయ్ వీర్ సింధును 'ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47' సినిమాలో విలన్ పాత్ర కోసం మూవీ బృందం ఎంపిక చేసినట్లు సమాచారం. గతంలో ఈ పాత్ర కోసం పలువురు నటులను పరిశీలించినప్పటికీ, చివరకు ఉదయ్ వీర్ సింధునే మేకర్స్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా విడుదలయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి.



# ఓటీటీలోకి బ్లాక్ బస్టర్ మూవీ..

కోలీవుడ్‌లో సంచలన విజయం సాధించి, తెలుగు యువతను కూడా విశేషంగా ఆకట్టుకున్న రొమాంటిక్ కామెడీ చిత్రం 'యూత్' . ప్రముఖ నటుడు కరుణాస్ తనయుడు కెన్ కరుణాస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా, హీరోగా కూడా తనదైన నటనతో మెప్పించారు. ఇందులో అనిష్మా అనిల్ కుమార్, ప్రియాన్షీ యాదవ్, మీనాక్షీ దినేశ్ కీలక పాత్రలో నటించగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. చిన్న సినిమాగా విడుదలై, కేవలం మౌత్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న ఈ మూవీ, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్ మీద సందడి చేసేందుకు సిద్ధమైంది. నేటి కాలంలో యువత ప్రేమ, స్నేహం మరియు బాధ్యతల మధ్య ఎలా నలిగిపోతున్నారనే అంశాన్ని ఈ సినిమాలో చాలా సహజంగా చూపించారు. కథ విషయానికొస్తే.. హీరో కెన్ కరుణాస్ ఒక సాదాసీదా యువకుడిగా కనిపిస్తారు.ఆయన చుట్టూ అనిష్మా అనిల్ కుమార్, ప్రియాన్షీ యాదవ్, మీనాక్షీ దినేశ్ పాత్రలు తిరుగుతుంటాయి. మన ప్రేమకు ఇదెలాంటి పరీక్ష అనే క్యాప్షన్ సూచించినట్లే.. ఈ సినిమాలో ప్రేమలో వచ్చే ఒడిదుడుకులు, నమ్మకద్రోహాలు, అపార్థాల చుట్టూ ఆసక్తికరమైన డ్రామా సాగుతుంది. కేవలం రొమాంటిక్ ఎంటర్టైనర్‌గానే కాకుండా, తప్పు చేసిన యువత మళ్ళీ ఎలా గాడిలో పడతారు? సమాజంలో వారు ఎదుర్కొనే సవాళ్లు ఏంటి? అనే పాయింట్‌ను ఆసక్తికరంగా చూపించారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాలోని ఎమోషన్స్‌ను పీక్స్‌కు తీసుకెళ్లింది. థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన ఈ చిత్రం డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకుంది. అంతేకాకుండా స్ట్రీమింగ్ తేదీపై అధికారికంగా ప్రకటించారు. ట్విట్టర్ ద్వారా.. ఈ సినిమా ఏప్రిల్ 16 నుంచి తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ కానుందని వెల్లడించారు.

# సెట్స్‌పైకి వెళ్తున్న క్రేజీ కాంబో..



దిగ్గజ దర్శకుడు మణిరత్నం తన సినిమాలతో వెండితెరపై ఒక అద్భుతాన్ని సృష్టిస్తుంటారు. 'పొన్నియిన్ సెల్వన్' వంటి భారీ చిత్రాల తర్వాత, ఆయన ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఈసారి మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, నేచురల్ బ్యూటీ సాయి పల్లవిలను ప్రధాన పాత్రల్లో ఎంపిక చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఇద్దరు నటులు తమ సహజ సిద్ధమైన నటనతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నవారే, ఇప్పుడు మణిరత్నం మేకింగ్‌లో వీరు కలిసి కనిపిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే ఈ కాంబినేషన్ గురించిన వార్తలు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ 2026 మే 14 నుంచి ప్రారంభం కానుంది. అయితే, అంతకంటే ముందే అంటే ఈ ఏప్రిల్ నెలాఖరులోనే ఒక పవర్‌ఫుల్ ప్రోమో షూట్‌ను నిర్వహించాలని మేకర్స్ ప్లాన్ చేశారట. ఈ ప్రోమో ద్వారా సినిమా థీమ్ లేదా టైటిల్‌ను అనౌన్స్ చేసే అవకాశం ఉందని టాక్. మణిరత్నం ఈ చిత్రాన్ని కేవలం 40 నుండి 45 రోజుల్లోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.విజయ్ సేతుపతి, సాయి పల్లవి మధ్య సాగే ఎమోషనల్ అండ్ ఇంటెన్స్ డ్రామాగా ఈ సినిమా ఉండబోతుందని టాక్ నడుస్తోంది. వీరిద్దరి కెమిస్ట్రీ వెండితెరపై కొత్త మ్యాజిక్ క్రియేట్ చేయడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విజేత, రాక్‌స్టార్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. మణిరత్నం-రెహమాన్ కాంబినేషన్ అంటేనే అదొక మ్యూజికల్ ట్రీట్. ఇప్పటికే రెహమాన్ ఈ సినిమా కోసం రెండు అద్భుతమైన పాటల కంపోజిషన్ పూర్తి చేశారని సమాచారం. మద్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. బలమైన కథకు తోడు, అద్భుతమైన నటీనటులు, మ్యూజికల్ వండర్ తోడవ్వడంతో ఇది ఇండియన్ సినిమా చరిత్రలో మరో మైలురాయిగా నిలుస్తుందని నెటిజన్లు అంచనా వేస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ కోసం సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# రూ.కోట్లలో వసూళ్లు..

ప్రముఖ ఫోక్ సింగర్ మంగ్లీ అలియాస్ సత్యవతిపై పంజాగుట్ట పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. మైక్రో ఫైనాన్స్ పేరిట రూ.10 కోట్లు పెట్టుబడి మోసానికి సంబంధించిన వ్యవహారంలో బాధితుల తరపున వాదిస్తున్న న్యాయవాదిని బెదిరించారనే ఆరోపణలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి. ఈ కేసులో మంగ్లీతో పాటు ఆమె సోదరుడు శివ, 'విరాటపర్వం' చిత్ర దర్శకుడు వేణు ఊడుగుల పేర్లు కూడా చేరడం గమనార్హం.


Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229